RNI NO:TELTEL/2017/74161

www.janavijayam.com

# జన విజయం
# JANA VIJAYAM

ఖమ్మం | సంపుటి : 8 | సంచిక : 48 | 31 ఆగష్టు - 06 సెప్టెంబరు, 2025 | ఎడిటర్ : పల్లా కొండల రావు | పేజీలు : 8 | వెల : రూ. 15.00

KHAMMAM | Volume : 8 | Issue : 48 | 31 August - 06 September, 2025 | Editor : Palla Kondala Rao | Pages : 8 | Price : Rs.15.00

**మీరు జర్నలిస్టుగా పని చేస్తారా?**

రెండు తెలుగు రాష్ట్రాల నుండి జనవిజయం వారపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్, నియోజకవర్గం ఇన్‌చార్జ్, మండల రిపోర్టర్‌లు కావలెను.

సంఘటనను వార్తగా మలచే తెలుగు భాషా ప్రావీణ్యం ఉంటే చాలు.

18సం. పైన వయసు కలిగియుండి జర్నలిజం పట్ల ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.


మీ వివరాలను పంపించాల్సిన చిరునామా:

వాట్సాప్ నెంబర్ : 9866925937

మెయిల్ ఐ.డి : janavijayam@gmail.com

## బిజెపిలో కొత్తతరానికి ప్రాధాన్యం

### రాంమాధవ్‌కు అవకాశం దక్కేనా?





**న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** భారతీయ జనతాపార్టీ ఇప్పుడు కొత్త రూపు సంతరించుకుంటోంది. నవతరం ముందుకు రావడంతో సిద్దాంతపరమైన నిబద్దతలకు అవకాశంలేని కొత్తతరం దూసుకువస్తోంది. అధికారమే పరమావధిగా ఇందులోని నేతలు ఆరాటపడుతున్నారు. అధికారం చేపట్టిన గత పదకొండేళ్లుగా మోడీ ద్వయం ఇక పార్టీలో తమకు తిరుగులేనివిధంగా చేసుకున్నారు. విధాన నిర్ణయాలన్నీ ఇప్పుడు కేవలం మోడీ ద్వయం కనుసన్నల్లోనే సాగుతున్నాయి. ఈ క్రమంలో ఉపరాష్ట్రపతి పదవికి అనూహ్యంగా రాధాకృష్ణన్ ఎంపిక చేశారు. ఇదో రకంగా ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో జరిగిన వ్యవహారంగా చూడాలి. అలాగే ఇప్పుడు బిజెపి అధ్యక్ష బాధ్యతలు ఎవరికి కట్టబెడతార్నది చూడాలి. మోడీ అనుయాయులకా లేక, పార్టీని నమ్ముకున్న వారికా అన్నది తెలియాలి. ఇప్పటికే అధ్యక్ష పదవిని పూర్తి చేసుకున్న నడ్డా స్థానంలో ఎవరన్నది తేలడం లేదు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల కారణంగా నడ్డాను కొనసాగించారు. రాధాకృష్ణన్ లాగా ఇప్పుడు కొత్త తరం ఎవరైనా వస్తారా అన్న చర్చ సాగుతోంది. తెరవెనక్కి పోయిన రాంమాధవ్ లాంటి వారిని మళ్లీ ముందుకు తీసుకుని వస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఆయన సమకాలీన వ్యవస్తలపై బాగా పట్టు ఉండడంతో పాటు, ఆర్ఎస్ఎస్ మనిషి.అయితే ఏదైనా మోడీ ద్వయంను కాదని ఏ ఒక్క నిర్ణయం కూడా జరగడం లేదు. అంతేగాకుండా పాతతరం నేతలకు మెల్లగా ఉద్వాసన పలికారు. ఈ క్రమంలో ఇప్పటికే అద్వానీ ఇంటికే పరిమితం అయ్యారు. ఆయనకు కనీసం రాష్ట్రపతి పదవి కూడా కట్టబెట్టకుండా కక్ష తీర్చుకున్నారు. అలాగే మురళీమనోహర్ జోషి, సుమిత్రా మహాజన్ లాంటి వారు దూరంగా ఉన్నారు. సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీ లాంటి వారు గతించారు. ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ చేయడంతో వెంకయ్య నాయుడు ఇక పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన లేకుండా అయ్యారు. ఇక మిగిలిందల్లా..రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే. ఇప్పటికే శతృఘ్ను సిన్హా, యశ్వంత్ సిన్హాలు బయటకు పోయారు. అరుణ్ శౌరి లాంటి వారి అడ్రస్ లేదు. మధ్యప్రదేశ్ సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కూడా కేంద్ర పార్టీలో ప్రమేయం లేకుండా పోయింది. ఈ క్రమంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు ఈ దఫా వరకు మంత్రులుగా కొనసాగుతారు. తరవాత వీరు కూడా పార్టీకి దూరం కావడం ఖాయమని గుర్తించాలి. ఇప్పటికే పార్టీలో వీరికి పెద్దగా ప్రాధాన్యం లేదు. ఈ క్రమంలో పార్టీ పునర్వ్యవస్తీకరణ తీరు చూస్తే మనకు వారి వ్యూహం అర్థం కాగలదు. దేవేంద్ర ఫడ్నవీస్‌కు స్థానం కల్పించడం మహారాష్ట్ర ప్రాధాన్యత తెలియచెబుతోంది. రాష్ట్రస్థాయిని దాటి వేగంగా జాతీయ స్థాయికి ఎదిగిపోతున్న యోగి ఆదిత్యనాథ్‌కు అడ్డుకట్టవేయాలంటే మరో ఠాకూర్ నాయకుడు ఉండాల్సిందే కదా అని కొందరు అంటున్నారు. పార్టీలోని మిగతావారంతా మోదీ, అమిత్ షా తరువాతేనని ఈ మార్పు చేర్పులతో స్పష్టం చేయదల్చుకున్నారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీ రాజకీయ ప్రయోజనాలను నిలబెట్టుకుంటూనే పార్టీలో తమ పట్టును మోడీ, అమిత్ షాలు నిలుపుకున్నారు. కర్ణాటక నుంచి యడ్యూరప్పను కేంద్ర కమిటీలోకి తీసుకున్నారు. అలాగే, మధ్యప్రదేశ్ చౌహాన్‌ను తప్పించే క్రమంలో కేంద్రమంత్రి మంత్రి మండలిలోకి తీసుకున్నారు. పార్టీకి కొత్తరక్తం అవసరం కంటే, పాతతరాన్ని వదిలించుకొనే లక్ష్యం కనిపిస్తోంది. యూపిలో యోగి ఆదిత్యనాథ్ విజయంతో, రేపు మోదీ వారసుడు అంటూ ప్రచారం సాగింది. ఈశాన్యం నుంచి శర్బానంద్ సోనోవాల్ ఎంపిక వెనుక కూడా రాజకీయాలు ఉన్నాయి. సోనోవాల్‌కు స్థానం కల్పించడమంటే అసోం సిఎం శర్మను హద్దుల్లో ఉంచడం కోసమే అని అర్థం చేసుకోవాలి. ప్రతీ ఎన్నికనూ ఓ మహాయుద్ధంగా భావించే మోడీ ద్వయం ఇప్పుడు బిజెపి అధ్యక్షుడిని ఎన్నుకోవడంలో ఎవరిని తెరపైకి తెస్తారన్నది చూడాలి.

## ఆర్థిక దివాళాపై ఎన్నాళ్లీ మౌనం

### ఉచిత పథకాలతో ఉపయోగమెంత?

### ఓటు బ్యాంకి రాజకీయాలకు బలయ్యేది ప్రజలే!

### జాతీయ స్థాయిలో చట్టం తేవాలి

ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు ఇవ్వడమే ప్రభుత్వ సక్సెస్‌గా భావిస్తున్నారు. పెన్షన్లు ఇవ్వడం, ఇంటింటికీ తిరిగి రేషన్ కార్డులు, రేషన్ ఇవ్వడం కూడా ఘనతగా భావిస్తున్నారు. గ్రామాల్లో స్థానిక సంస్థలు, అధికారులు, సర్పంచ్, వార్డుమెంబర్లు చేయాల్సిన పనులను మంత్రులు, ముఖ్యమంత్రులు చేపట్టడం సిగ్గుచేటు. అడ్డోగోలుగా కిలో రూపాయికి సన్నబియ్యం, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, తల్లికి వందనం, ఆరోగ్యశ్రీలు వంటివన్నీ పెట్టి సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు. ప్రజలను చేతగాని వాళ్లుగా తయారుచేసి, కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మారుస్తున్నారు.దీంతో ఆస్పత్రులు, స్కూళ్ల అభివృద్ధి లేకుండా పోయింది. రోడ్లు వేయడం లేదు. అభివృద్ది పనులకు ఖర్చు చేయాల్సిన ప్రజల డబ్బును పాలకులు దుబారాచేసేస్తున్నారు. మోడీ మొదలుకుని చంద్రబాబు,రేవంత్ వరకు ఇదే చేస్తున్నారు. ఇలా ఉచిత పథకాలు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని దివాళా తీస్తున్నా.. ఎవరు కూడా ప్రశ్నించడం లేదు. ఎందుకిలా అని నిలదీయడం లేదు. లబ్ది పొందుతున్న వారు ఎలాగూ ప్రశ్నించరు. ఉచిత పథకాల అమలును ఎంతవరకు విచారించవచ్చన్న చర్చ జరగాలి. అభివృద్ధిపనులు, మౌలిక వసతులను పక్కనపెట్టి కేవలం ఉచిత పథకాల కోసం డబ్బు ఖర్చుపెట్టడాన్ని మెజార్టీ ప్రజలు తప్పుపడుతున్నారు. ఏది ఉచితం? ఏది ప్రజల అభ్యున్నతి కోసం అమలుచేస్తున్న పథకం అని చెప్పడం నిజంగానే కష్టం. వృత్తిచేసుకునే వారికి అవసరమైతే వారు వ్యాపారాలు చేసుకోవడానికి, పనులు చేసుకోవడానికి బ్యాంకుల ద్వారా ఆర్థిక చేయూతను అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికంలో మగ్గేవారి జీవనోపాధులు ఆ చిన్న పరికరాలపైనే ఆధారపడి ఉంటాయి. అలాంటివి ఇవ్వడంవల్ల వారి జీవితంలో పెద్ద మార్పు కనిపిస్తుంది. అయితే ఆర్థిక పరిస్థితులను తెలుసుకోకుండా అమలు చేసే వాగ్దానాలను అనుమతించకూడదని రాజకీయ పార్టీలు గుర్తించాలి. అలాగే ఉచిత పథకాలు అన్నవి పూర్తిగా ప్రభుత్వాల విచక్షణాధికార పరిధిలోని అంశమని చెప్పడానికి వీల్లేదు. ఏ రాష్ట్రమైనా ఉచిత పథకం అమలు చేస్తుంటే ప్రజలు కూడా వద్దని అనలేరు. ఉచిత పథకాలు అమలు చేయకూడదని కేంద్రం చట్టం చేస్తే..అది చట్టబద్దతకు లోబడి ఉండాల్సి వస్తుంది కనుక జాతీయస్థాయిలో దీనిపై చర్చించాలి. అధికారంలోకి వచ్చిన పార్టీ అమలుచేసే ఉచిత పథకాల గురించి ఆర్థిక సమర్థత కూడా ముఖ్యం. అదేపనిగా అప్పులు చేస్తూ పథకాలు అమలు సమంజసమా? కాదా? అన్నదే ముఖ్యం. అప్పుడే అభివృద్ది అన్నది ముందుకు సాగుతుంది. రేపటి తరం భవిష్యత్ కూడా ముఖ్యమన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పథకాలను సమీక్షించాలి. చర్చించాలి. అప్పుడే అభివృద్ధికి నిధుల కొరత ఉండదు కనుక ఆ దిశగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసే సంకల్పంతో ముందుకు సాగాలి. విపక్షాలకు కూడా ఓట్లు కావాలి గనక ప్రశ్నించడం లేదు. ఇక పన్నులు కట్టేవారు కూడా ప్రశ్నించడం లేదు. మేధావులు కూడా నిలదీయడం లేదు. ఇలా అయితే రాజకీయ పార్టీలు ఓట్ల వేటలో చేస్తున్న పథకాలు, పందేరాలతో రాష్ట్రాలు అప్పులో ఊబిలో కూరుకుపోతున్నాయి. వడ్డీలకే వేలకోట్లు తగలేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు దివాళా అంచున ఉన్నాయి. రాజకీయ పార్టీల ఉచిత పథకాల హామీలపై సుప్రీంకోర్టు గతంలోనే కీలక వ్యాఖ్యలు చేసింది. అయినా రాజకీయ పార్టీలు దేశ ఆర్థిక వ్యవస్థను, అభివృద్దిని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగడం లేదు. సరికదా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి పథకాలను అమలు చేస్తున్నారు. పందేరం పథకాలు అన్నీ కూడా ఆర్థిక దివాళాకు హేతువు కాగలదు. ఎపిలో అయితే దానకర్ణుడిలా గత సిఎం జగన్ పథకాలను ప్రకటిండం, నగదు బదిలీలు చేపట్టడం నిత్యకృత్యంగా మార్చుకున్నారు. దీంతో ఎపి అప్పులకుప్పగా మారింది. ఇలాంటి పథకాలకు ఎక్కడో ఒకచోట చెక్ పడాల్సింది. డబ్బులు పంచే పథకాల బదులు అభివృద్ధి పథకాలపై దృష్టి సారించాలి. ఇబ్బడి ముబ్బడిగా డబ్బులను నేరుగా ఓటర్లకు బదిలీ చేసే ప్రక్రియను ఆపకుంటే దేశం ఆర్థికంగా దివాళా తీస్తుంది. అభివృద్ది కుంటుపడుతుందని గుర్తించాలి. డబ్బులు పంచడమే అభివృద్ది అంటూ చేస్తున్న ప్రకటనలకు ఇకనైనా చెల్లు చీటీ చెప్పాలి. ఉచిత పథకాలు, నగదు బదిలీలు, పేదలపేరుతో చేసే పందేరాల విషయంలో సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు గతంలోనే అభిప్రాయపడింది. మనమంతా అత్యున్నత న్యాయస్థానానికి గౌరవం ఇవ్వాలి. ప్రజాస్వామ్య దేశంలో ఒక అంశంపై చర్చించి చివరకు నిర్ణయం తీసుకోవాల్సింది పార్లమెంటేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆనాటి చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణ పునరుద్ఘాటించిన నేపథ్యంలో దీనిపై పార్లమెంట్ విస్తృతంగా చర్చించాలి. ఏది ఉచితమో ఏది అనుచితమో చర్చించేందుకు విస్తృత ప్రజాభిప్రాయం సేకరించాలి. గ్రామస్థాయి వరకు వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న పందేరాలపై చర్చ చేయాలి. ప్రజలు కూడా నిర్భయంగా చర్చించాలి. రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజలు, ఆర్థిక నిపుణలు ఎవరికి వారు తమ స్థాయిలో చర్చించి ఏది ఉచితమో..ఏది అనుచితమో..ఏది అవసరమో అన్నది చర్చచేయాలి. విపక్షాలు కూడా ఉచితాలను ప్రకటించి ఓట్లు పొందాలన్న కక్కుర్తిలో పడి ఏదిపడితే అదే అన్నట్లుగా హామీలు గుప్పిస్తున్నారు. ఉచితాలు ఎంతవరకు అవసరమో అన్నది ప్రజలే సరైన నిర్ణయం తీసుకోవాలి. ఉచితంగా డబ్బులు అందుతున్నాయి గదా అనుకుంటే..పన్నుల రూపంలో మన జేబులు దోచేస్తున్న తీరును గుర్తించడం లేదు. తాము కష్టపడి పన్నుల రూపంలో కడుతున్న డబ్బులను ఉచితం పేరుతో ఇష్టానుసారంగా పంచిపెడుతూ రాజకీయ లబ్ది పొందుతున్న పార్టీలను దూరం పెడితే అసలు సమస్యే రాదు. ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా రాజకీయ పార్టీలు అమలు చేసే ఉచిత పథకాలను నియంత్రించేలా కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఏదో నిర్ణయం తీసుకోవాలి. చట్టబద్దంగా ఇలాంటి ఉచిత పథకాలపై నియంత్రణకు దిగాలి. లేకుంటే పాలన అంటే పంచడం అన్నదే పనిగా పెట్టుకోగలరు. పార్లమెంటులో చర్చ చేసి ఉచిత పంపకాలపై ఆంక్షలు విధించాలి. దేశ ఆర్థిక పరిస్థితులు, ప్రజల సంక్షేమం గురించి ఆసక్తి ఉన్నవారు వీటిని దృష్టిలో ఉంచుకొని సూచనలు చేయాల్సిన సమయం ఆసన్న మైంది. ఉచిత పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ మొదలు పెట్టాల్సి ఉంది. ఈ విషయాల గురించి ప్రస్తావించడం ద్వారా దేశంలో ఓ అవసరమైన చర్చకు ఇప్పుడు నాంది పలకాలి. అయితే చర్చలకు దూరంగా ఉంటున్న మోడీ ప్రభుత్వం ఈ విషయంలోనూ చర్చకు ముందుకు వస్తుందన్న అవకాశం లేదు. కానీ ఇప్పటికీ నిజాయితీగా ఉన్న నేతలు దీనిపై చర్చ చేస్తే మంచిది. పార్లామెంట్ అని చూడకుండా చట్టసభల్లో రాష్ట్రాలు చర్చించాలి. ప్రజల్లో నేతలు చర్చించాలి. తమ డబ్బులను పందేరం చేస్తున్న నేతల తీరుపై రచ్చబండల్లో ప్రజలే చర్చించాలి.

## ఓటరుతో ఆధార్ నమోదు చేయాలి

### బోగస్ ఓట్ల ఏరివేత పక్కాగా సాగాలి

**న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** ఓటర్‌ను ఆధార్‌తో నమోదు చేయించే ప్రక్రియ జరక్కపోవడం, దానిని తప్పనిసరి చేయక పోవడంతో ఓటర్ల జాబితా ఎప్పుడూ గందరగోళానికి, విమర్శలకు గురవుతోంది. బీహార్ వ్యవహారంలో ఇది విమర్శలకు దారితీసింది. ఓట్ల నమోదు, తొలగింపు ప్రక్రియ అభాసు పాలయ్యింది. చివరకు సుప్రీం జోక్యం చేసుకునే పరిస్తితి వచ్చింది. విపక్షాలు ఆందోళనతో పార్లమెంట్‌ను స్తంభింపచేశాయి. పక్కా ఓటరు నమోదు ప్రక్రియ సవాల్‌గా తీసుకోవాలి. గతంలో ఫోన్‌లకు ఆధార్ నమోదు కోసం మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఓటరు కార్డుతో ఆధార్ నమోదు ద్వారా బోగస్ ఓట్లను అరికట్టాలని అధికారులు నిర్ణయించారు. ఒక వ్యక్తి ఒకే ఓటు హక్కు ఉండాలనేది ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు ఆధార్ నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించినా అది ముందుకు సాగలేదు. ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపినా, బీహారల్‌లో విమర్శల పాలయ్యింది. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్ ద్వారా డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తించి జాబితాను రూపొందించవచ్చు. జాబితా సిద్ధం కాగానే జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి వాటిని తొలగించేయాలి. ఇలా ప్రతి జిల్లాలో చర్యలు చేపట్టడం ముఖ్యం. దేశం యావత్తూ ఓట్ల నమోదు,ఆధార్ అనుసంధాన ప్రక్రియ కొనసాగితే పంచాయితీ ఉండదు. చాలామంది నివాసాలు మారడంతో రెండు, అంతకుమించి చోట్ల ఓటుహక్కు ఉంటోంది. కొంతమంది పిల్లల చదువు, ఉద్యోగరీత్యా పట్టణాల్లో నివాసం ఉంటున్నారు. సొంత గ్రామాల్లో ఓటు హక్కుతో పాటు నివాసం ఉంటున్నచోట సైతం వీరు ఓటు హక్కు వినియోగంచుకుంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు మున్సిపాల్టీ ఎన్నికల్లో సైతం ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఇలాంటి వాటిని నివారించడానికి ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టాలి. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్‌తో ఇటువంటి వాటికి చెక్ పెట్టే అవశం ఉంది. రెండు చోట్ల ఒకే ముఖ కవలికలు ఉంటే కొత్తగా వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు వీరిని గుర్తించవచ్చున్నారు. ఇలా రెండుచోట్ల ఓటుహక్కు ఉన్న వారందరినీ గ్రామాలు, వార్డుల వారీగా గుర్తించవచ్చు. ఇలా రెండేసి ఓటరు జాబితాలో ఉన్న వారిని ఒక చోట ఓటు హక్కు తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలి. అలాగే ఇతరరాష్ట్రాల్లోకూడా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి అవకాశం లేకుండా అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాలి. ఓటరుకార్డు ఉన్న వారు ఫారం-6లో పూర్తి వివరాలు నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేస్తే వాటిని క్రోడీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. నమోదు చేసిన వెంటనే ఓటరు ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. వీటితో పాటు డబుల్ ఓటరు కార్డులున్న వారికి ఇప్పటికే సమాచారం అందించి తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తారు.

## మేలుకోరే వారే నిస్వార్థపరులు

**తిరుమల,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):**మంచి చెప్పేవారే మనవారు. మన మేలుకోరేవారు నిస్వార్థపరులు. మనం చెడిపోతే సంతోషించేవారు స్వార్థపరులు. ఇలాంటివారిలోనే అహంకారం నిండి ఉంటుంది. ఫల్గుణుడు, శ్రీకృష్ణుడు ఎంతోకాలం సన్నిహితులుగా మెలిగారు. రణరంగం మధ్యలో రథాన్ని నిలిపి గీతను బోధిస్తున్నప్పుడు పార్థసారథి తన చెలికాడే కదా... ఈయన చెప్పేది తానెందుకు వినాలని కౌంతేయుడు భావించి ఉంటే బహుశా మహాభారత యుద్ధం సంభవించేదే కాదేమో! ధీరులు అంటే కండబలం ఉన్నవారు కానేకాదు. సమర్థులై, వివేకం కలిగినవారే ధీరులు. సమర్థత ఉంటే కార్యసాధకులవుతారు. అశోకుడి జీవిత చరిత్ర గమనిస్తే చకితులం అవుతాం. కండ బలంకన్నా అతడి మస్తిష్కం గొప్పది. అందువల్ల అతడెన్నో యుద్ధాలను జయించగలిగాడు. అతడి బలహీనత రాజ్యకాంక్ష. ఆలోచనలు మాత్రం గొప్పవి. జయాపజయాలు ఇహానికి సంబంధించినవని శాంతిలోనే ధర్మం ఉందని గ్రహించాడు. అందుకే కళింగ యుద్ధంలో విజయం సాధించిన అనంతరం వివేకం మేలుకొని గౌతమ బుద్ధుడు చెప్పిన పథంలో నడిచాడు.

## భారత్ అమెరికా రాయబారిగా సెర్గియో గోర్

### భారత్‌తో గిల్లి కజ్జాలు కోరుకుంటున్న ట్రంప్

**న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** భారత్‌తో గిల్లి కజ్జాలనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరుకుంటున్నారు. సుంకాల పెంపు, వీసాలపై కఠిన నిబంధలను ఇలా ఒక్కో చర్య ట్రంప్ భారత వ్యతిరేకతను చాటాయి. తాజాగా మరో దుందుడుకు చర్యకు పూనుకున్నారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్-అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్యవర్గాలను షాక్‌కు గురిచేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 ఏళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీతమైన నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు. 2009లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా భారత-పాక్-అఫ్గానిస్థాన్‌ను ఒకే పాలసీ కిందకు తెచ్చేందుకు యత్నించారు. నాడు రిచర్డ్ హోల్‌బ్రూక్‌ను ఈ ప్రాంతం మొత్తానికి ప్రత్యేక రాయబారిగా నియమించారు. అయితే.. నాటి భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దీనిపై అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డ్‌కు తమ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ చర్య భారత్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు. దీంతో నాడు బ్రూక్‌ను పాక్-అఫ్గానిస్థాన్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు వికీలీక్స్‌లో బహిర్గతమైన పత్రాల్లో తేలింది. ఇప్పుడు ట్రంప్ భారత్‌కు నచ్చని అటువంటి చర్యే తీసుకొన్నారు. శ్వేతసౌధంలో ట్రంప్ వ్యక్తిగత కార్యదర్శి హోదాలో అమెరికా ప్రభుత్వంలో ఏకంగా 4,000 నియామకాలు చేశారంటే.. గోర్ పరపతిని అర్థం చేసుకోవచ్చు. మస్క్ దోస్త్ జరేడ్ ఇస్సాక్‌మన్ నాసా చీఫ్‌గా తొలుత ప్రకటించారు. ఆయన నామినేషన్ ఆమోదం కోసం సెనేట్‌కు పంపే సమయంలో మస్క్-ట్రంప్ మధ్య విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. అదే సమయంలో ఇస్సాక్‌మన్ డెమోక్రాట్లకు ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు- గోర్ నుంచి అధ్యక్షుడికి సమాచారం వెళ్లింది. దీంతో డోజ్ అధిపతిగా మస్క్ చివరి రోజున.. నాసా చీఫ్ పదవి నుంచి ఇస్సాక్‌మన్ పేరును ట్రంప్ తొలగించారు. ఈ నేపథ్యంలో గోర్‌ను 'పాము'గా అభివర్ణిస్తూ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇక సెనెట్‌లో ఆమోదముద్ర పడితే గోర్ భారత్‌కు రావడం ఖాయమవుతుంది. ఇది కూడా అంత ఈజీ ఏమీ కాదు. బైడెన్ ప్రభుత్వం నియమించిన ఎరిక్ గార్సెట్టీకి సెనెట్ ఆమోద ముద్ర వేయడంలో తీవ్ర జాప్యం చేసింది. దీంతో ఆయన చివరి రెండేళ్లు మాత్రమే భారత్‌లో పనిచేశారు. గోర్‌నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అన్నారు. పాకిస్థాన్ సహా పొరుగుదేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈ చర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకేగాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూదిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు.. ఇక భారత్-అమెరికా సంబంధాల్లో ఇండో-పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు. మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియామకం భారత్-అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. అధ్యక్షుడి అజెండాను ముందుకుతీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను బలోపేతం చేస్తుందని చెప్పలేమన్నారు. అమెరికా అనుసరించే పాక్-అఫ్గాన్ పాలసీతో భారత్‌ను కూడా కలపడం ఇబ్బందికరమే అని తెలిపారు. వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని భారత్‌లో నియమించి ట్రంప్ నుంచి మోదీ ప్రభుత్వానికి బలమైన సంకేతాలు వెళ్లాయని అనుకునేలా చేసతున్నారు. అధ్యక్షుడి నుంచి వచ్చే అభ్యంతరాలు, ఇతర సందేశాలపై భారత్ కూడా తీవ్రంగా పరిగణించి.. చర్చలు జరపాల్సిన అవసరం ఉంటుంది.

# ప్రకృతి ప్రేమే...వినాయక పూజ !

భారతీయ సాంప్రదాయాలు, పండగలు అన్నీకూడా ప్రకృతితో ముడిపడి ఉన్నవే. ప్రకృతిని ఆరాధించడం మనజీవితంలో నిత్యకృత్యం. ప్రకృతితో ముడిపడి ఉన్న పంచభూతాలను ఆరాధించడం వేదకాలం నుంచే ఉంది. మట్టితో గణపతులను చేయడం, పూలూ,పత్రి పెట్టడం, అవన్నీ చెరువులో వేయడం వెనక ప్రకృతి పరమార్థం దాగివుంది. మన పండగలన్నీ ప్రకృతి ఆరాధనతో మమేకమై వుంటాయి. వినాయకచవితి పర్వదినంలో మనం అనేక పుష్పాలు, ఫలాలతో స్వామిని పూజిస్తాం. విఘ్నాలను నివారించే వినాయకుని పూజతో మనం పండగను జరుపుకొంటాం. వినాయక పూజలో ఉపయోగించే పత్రిలో విశేష ఔషధ గుణాలు ఉన్నాయి. గోరంత పత్రి పెడితే చాలు కొండంత వరాలు గుప్పిస్తాడు. అందుకే వినాయక పూజ అంటే అందరికీ ఇష్టం. వారిని ప్రోత్సహించడం ద్వారా ప్రకృతికి పాటుపడేలా చేయాలి. ఉండ్రాళ్ళ నైవేద్యానికే మహదానందపడిపోతాడు విఘ్నేశ్వరుడు. ఒక్క వినాయకుడికే పత్రిపూజ ఎందుకు చేస్తాం? ఎందుకంటే ఆయన గజముఖుడు కదా! ఏనుగుకు ఇష్టమైనవి ఆకులే కదా! అందుకే ఈ పత్రి పూజ. ఏకవింశతి... అంటే ఇరవైఒక్క రకాల పత్రితో గణేశుణ్ణి పూజిస్తాం. గజాననుడని కీర్తించినా, మూషిక వాహనుడని మొక్కినా, సర్వవిఘ్నాలకు అధినాయకుడని శిరస్సు వంచినా తొలిపూజలు దక్కేదతనికే. అందుకే భాద్రపద శుక్ల చవితి రోజున భక్తి శ్రద్ధలతో వినాయక పూజ చేసుకోవడం పుణ్యప్రదం.. మోక్ష దాయకం! అయితే ప్రకృతిని ఆరాధిస్తున్న మనం..దాని విధ్వంసాన్ని పట్టించుకోవడం లేదు. ప్రకృతి పరిరక్షణ చర్యలను పెద్దగా గుర్తించడం లేదు. దీనినుంచి బయటపడే మార్గాలను ఆలోచించాలి. విఘ్నాలను నివారించే వినాయకుని పూజతో మనం పండగను జరుపుకొంటాం. గణపతి అంటే ప్రకృతి ప్రియుడు. ఆయనకు మనం చేసే పూజ అంతా ప్రకృతి ఆరాధన కిందకే వస్తుంది. చెరువుల్లో మట్టిని తవ్వి తీసుకుని వచ్చి వినాయకుడిగా చేసి, మళ్లీ చెరువలోనే పూజించిన పత్రీపూలతో నిమజ్జనం చేయడం వెనక శాస్త్రీయత ఉంది. మట్టిని తీసి మళ్లీ అది ఎరువుగా, చెరువు నీరు కాలుష్య రహితంగా కావడానికి జరిగే ప్రక్రియ ఇందులో ఇమిడి ఉంది. మనం పూజించే మారేడు, ఉత్తరేణి వంటివి ఔషధ గుణాలు కలిగి ఉండడం వల్ల వీటిని కాలుష్యం నుంచి కాపాడుతాయి. అందుకే వినాయకచవితి ఎన్నో ప్రత్యేకతలు కలిగిన పర్వదినంగా చూడాలి. ఏటా కొన్ని వేల గణపతి విగ్రహాలను రంగులతో అలంకరించి మండపాల్లో



ఏర్పాటుచేయడాన్ని చూస్తుంటాం. అలాగే ప్రతి ఇంట్లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి పూజ నిర్వహిస్తాం. ఇవన్నీ ప్రకృతికి దగ్గరగా ఉండేలా చూడాలి. అలాగే ప్రకృతి పరిరక్షణ ద్వారా పండగల పరమార్థం తెలుసుకోవాలి. గణపతి నవరాత్రుల కోసం ఖర్చు చేసే మొత్తాన్ని ప్రకృతి పరిరక్షణకు ఉపయోగిస్తే కరోనా లాంటి వైరస్‌లు మనలను ఏమీ చేయలేవు. వినాయకచవితి పర్వదినంలో మనం అనేక పుష్పాలు, ఫలాలతో స్వామిని పూజిస్తాం. నేత్ర, మూత్ర, చర్మ సంబంధమైన రోగాలతోపాటు మరికొన్ని ఇతర వ్యాధులకు మంచి మందుగా పనిచేస్తుందీ పత్రి. అంతేకాక ఆ పత్రి నుంచి వెలువడే సుగంధాన్ని పీల్చడం వల్ల కూడా స్వస్థత చేకూరుతుంది. పత్రిని మనం చేత్తో ముట్టుకోవడం వల్ల అందులో ఉండే వృక్ష సంబంధ రసాయన పదార్థాలు కావలసిన మోతాదులో చర్మం ద్వారా మన శరీరంలోకి శోషణం చెంది ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. తొమ్మిది రోజుల తర్వాత వినాయకుణ్ణి బావుల్లో, నదుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. ఇలా ఎందుకు చేయడం అంటే కలుషితమైన ఆ నీటిని శుభ్రం చేయడానికి ఈ 21 పత్రాలు ఉపయోగపడతాయట. అందుకే తొమ్మిది రోజుల పూజ తర్వాత విగ్రహంతో పాటు ఆకులను కూడా నీళ్లలో వదిలేసి వస్తారు. ఇవి ఇరవైమూడు గంటలయ్యాక తమలో ఉన్న ఔషధగుణాల ఆల్కలాయిడ్స్‌ని నీళ్లలోకి వదిలేస్తాయి. దాని వల్ల నీటిలో ఉండే బాక్టీరియా నిర్మూలన జరిగి నీళ్లల్లో ఆక్సిజన శాతం పెరుగుతుంది. వినాయక పూజ వల్ల మనకు విఘ్నాలు తొలగి అనుకున్న పనులన్నీ చక్కగా జరుగుతాయి. పిల్లలకు పత్రి సేకరణ వల్ల వృక్ష విజ్ఞానంతో పాటు వినోదం, పర్యావరణం పట్ల స్నేహభావం కలుగుతాయి. చెరువుల్లో మట్టిని తవ్వి తీసుకుని వచ్చి వినాయకుడిగా చేసి, మళ్లీ చెరువలోనే పూజించిన పత్రీపూలతో నిమజ్జనం చేయడం వెనక శాస్త్రీయత ఉంది. మట్టిని తీసి మళ్లీ అది ఎరువుగా, చెరువు నీరు కాలుష్యరహితంగా కావడానికి జరిగే ప్రక్రియ ఇందులో ఇమిడి ఉంది. అందుకే వినాయకచవితి ఎన్నో ప్రత్యేకతలు కలిగిన పర్వదినంగా చూడాలి. ఏటా కొన్ని వేల గణపతి విగ్రహాలను రంగులతో అలంకరించి మండపాల్లో ఏర్పాటు చేయడాన్ని చూస్తుంటాం. అలాగే ప్రతి ఇంట్లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి పూజ నిర్వహిస్తాం. వీటిని మట్టితో తయారుచేస్తేనే మన పర్యావరణం కాపాడకున్నవారం అవుతాం. ఇటీవల కొంతకాలంగా విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్యారిస్, రసాయనాలు కలిగిన రంగులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వినాయక నిమజ్జనంతో ఈ రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చెరువులు, కుంటలు, తటాకాలు, బావులు, నదులకు పర్యావరణ నష్టం జరుగుతోంది. ఈ జలాల్లో నివసించే అనేక జీవకోటి మనుగడకు విఘాతం ఏర్పడుతోంది. అలాగే నీరు కలుషితం అవుతోంది. దీంతో మళ్లీ ఇది వాడడానికి వీలు లేకుండా హైదారాబాద్ హుస్సేన్ సాగర్‌లా కాలుష్య కాసారంగా మారుతున్నాయి. అందుకే ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను వాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. మట్టి గణపతులను తయారుచేయడం ద్వారా కొంతయినా పర్యావరణం కాపాడుకోగలం. ఇంట్లో పూజించే చిన్న చిన్న వినాయక విగ్రహాలను పూర్తిగా మట్టితో తయారుచేస్తే అవి పర్యావరణహితంగా వుంటాయి. నీటిలో సులభంగా కరిగిపోతాయి. ఎలాంటి రంగులను వాడకపోవడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉండదు. ఇక వీధుల్లో ప్రతిష్టించే పెద్ద విగ్రహాల తయారీలోనూ మట్టినీ, పర్యావరణ హితమైన రంగుల్నీ వాడటం ద్వారా పర్యావరణానికి మేలు చేయొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇటువంటి విగ్రహాల వల్ల నిమజ్జన సమయంలో జలాలు కలుషితం కావని చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఈ వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా స్వచ్ఛమైన ప్రకృతి కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. పెద్ద పెద్ద చెరువులూ, తటాకాలూ, కుంటల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసి పర్యావరణాన్ని దెబ్బతీ-యకుండా చేస్తే అంతకు మించిన పర్యావరణపరిరక్షణ మరోటి ఉండదు.

# గణపతి సర్వశక్తులకు అధిపతి

## అందుకే ఆయనకు తొలిపూజ

**కాణిపాకం,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** గణపతి సర్వవిద్యాధి దేవతగా, వేదకాలం నుండి ఆరాధనలందుకుంటున్న దైవం, వేదాలలో స్తుతించబడి, గణాలకు అధిపతియై, శబ్దాలకు రాజుగా, ప్రణవ స్వరూపుడై శబ్దబ్రహ్మగా జ్ఞానానికి ప్రతీకగా నిలిచాడు. సృష్టి ఆదిలో దేవతా గణాల ప్రారంభం కంటే ముందే గణనాథునితో సృష్టి ప్రారంభించినట్లు వినాయక పురాణం తదితర పురాణాలు మనకి సూచిస్తున్నాయి. సృష్టి ప్రారంభానికి ముందు ఒకప్పుడు అమ్మవారు రాక్షసులతో యుద్ధం చేస్తున్నది. ఇంకా మనుషులే పుట్టకముందు అన్నమాట. అమ్మవారు పరమేశ్వరుణ్ణి తలచుకొన్నది. ఆయన అక్కడ ఉన్నారు. వారి చూపులు కలసినవి. ఆ చూపుల కలయికకి విఘ్నేశ్వరుడు పుట్టాడు. అంతటి పూర్వుడాయన. ఆయన పేరు మహాగణపతి. ఆ మహాగణపతి అవతారాలనే ఇప్పుడు మనం ప్రతి కల్పంలోనూ పూజిస్తున్నాం. సమస్త మంత్రాలలోను శక్తికి కారణాలైన బీజాక్షరాలన్నింటిలోకి ముందుగా ఉచ్చరించేదే 'ఓంకారం' అందుచేత ఈ గణపతిని ఓంకార స్వరూపుడిగా వర్ణించారు. విఘ్ననిర్మూలనకై అవతరించి మంగళ స్వరూపుడై సకల మానవాళికి ఆరాధ్యమూర్తియై నిలిచాడు. మహాశక్తి అయిన పార్వతీదేవికి 'ద్వారపాలకుడుగా' గణపతిని పెట్టినట్టు మన పురాణగాథ, దీనిలో అంతరార్థం ఏమిటంటే? మూలాధారంలో కుండలినీశక్తి యోగనిద్రలో ఉంటుంది అని, ఈ కుండలిని శక్తియే మహాశక్తి .అ మూలాధారంలో కుండలిని శక్తిని మేల్కొలపడానికి ప్రవేశించే ద్వారం వద్దనే గణపతి కావలిగా ఉన్నాడు. అంటే గణపతి బీజాక్షరంతో మూలాధారాన్ని చైతన్యవంతం చేస్తే శక్తిని మేల్కొల్పటం సాధ్యపడు తుంది. భక్తులకు సకల శుభాలను చేకూర్చే వినాయకుడు తాను భక్తుల పాలిట కల్పతరువు అని సూచించకనే సూచిస్తూ ఉంటాడు! ఆయన భంగిమలను కాస్త గమనిస్తే అవుననే అనిపిస్తుంది. చాలా ప్రతిమలలో వినాయకుడు తన ఎడమ కాలుని ముడుచుకుని, కుడిపాదాన్ని కిందకి ఉంచి కనిపిస్తాడు. దీనినే యోగ శాస్త్రంలో లలితాసనం అంటారు. సాక్షాత్తూ జ్ఞానానికి ప్రతిబింబమైన లలితాదేవి కూడా ఈ ఆసనంలోనే కనిపిస్తుంది. భారతీయ ప్రతిమలలో ఇది కాస్త అరుదైనప్పటికీ, బౌద్ధానికి సంబంధించిన ఎన్నో శిల్పాలు ఈ ఆసనాన్ని సూచిస్తుంటాయి. ఒక పక్క ప్రశాంతంగా ఉంటూనే అవసరమైనప్పుడు ఎలాంటి కార్యాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండే తత్వానికి ఈ ఆసనాన్ని ప్రతీకగా భావిస్తారు. కర్మయోగులకు ఈ రెండూ అవసరమే కదా! ఒక పక్క జీవితంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎదుర్కొంటూనే, మనసుని స్థిరంగా నిలుపుకోగలడమే మానవులకి నిజమైన సవాలు. తాను అలాంటి స్థితిలో ఉన్నానని గణేశుడు చెప్పకనే చెబుతున్నాడు. తనను కొలిచే భక్తుల విఘ్నాలను తొలగించి వారిని కూడా పరిపూర్ణమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతానని హామీ ఇస్తున్నాడు. అందుకనే భక్తులు ఎక్కువగా లలితాసనంలో ఉన్న వినాయకునికే పూజలు చేస్తుంటారు.

# భక్తిశ్రద్ధలకు ప్రతీక వినాయక చవితి

## నవరాత్రి ఉత్సవాల పరమార్థమే వేరు

**యాదగిరిగుట్ట,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** ప్రతి సంవత్సరం భాద్రపద శుద్ధ చతుర్థి రోజు మనం వినాయకచవితి పండుగని జరుపుకుంటాము. గణపతిని పూజించకుండా ఎలాంటి శుభ కార్యమూ తలపెట్టం. ఎందుకంటే, ఆయన కృపాకటాక్షాలతో సకల కార్యాలు నిర్విఘ్నంగా నెరవేరుతాయని శాస్త్రవచనం. ఏ పండగ రోజు లేని భక్తి శ్రద్ధలు వినయక చవితి రోజు ప్రదర్శిస్తారు. వినాయకుడికి కోపం రావద్దన్న స్పృహ చిన్నతనం నుంచే మన పెద్దలు అలవాటు చేశారు. అందుకే వినాయకచతుర్థి రోజు అందరూ ప్రాఃతకాలానే లేచి అభ్యంగన స్నానమాచరించి పట్టుబట్టలు లేదా శుభ్రమైన వస్త్రాలు ధరించి వినాయక పూజకు సిద్ధం అవుతారు. భాద్రపదమాసంలో వానలు పడుతూ, ఎక్కడికక్కడ చిత్తడిగా, బురదగా ఉంటుంది. గుంటల్లో నీళ్ళు నిలిచి సూక్ష్మక్రిములు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయంలో వినాయకునికి ఔషధ గుణాలున్న పత్రితో పూజ చేయడంవల్ల ఇంట్లో వాతావరణం బాగుండి, సూక్ష్మ క్రిములను నశింపజేస్తుంది. గణపతి నవరాత్రి ఉత్సవాల పేరుతో తొమ్మిది రోజులు పూజ చేయడం ఆనవాయితీ. ఈ తొమ్మిది రోజులు యథావిధిగా వ్రతం చేసే ఆచారం ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో ఉంది. కొన్నిచోట్ల రానురాను మరుగున పడుతోంది. కొందరు పూజ ముగిసిన తర్వాత వినాయకుని విగ్రహాన్ని తొలగించినప్పటికీ పత్రిని మాత్రం కనీసం తొమ్మిది రోజులు ఇంట్లోనే ఉంచి తర్వాత నదిలో నిమజ్జనం చేస్తారు. అంటే, పదిరోజులపాటు మనం ఔషధ గుణాలున్న పత్రి నుండి వచ్చే గాలిని పీలుస్తాం. తొమ్మిది రోజుల తర్వాత సమీపంలోని నదిలోనో, చెరువులోనో నిమజ్జనం చేయడం వల్ల కూడా లాభమే చేకూరుతుంది. పత్రిలోని ఔషధ గుణాలలో కొన్నయినా ఆ నీటిలో చేరతాయి. ఆ రకంగా అవి నీటిలోని క్రిములను నశింపజేస్తాయి. ఆ నీటిని తాగినప్పుడు అనారోగ్యాలు కలగవు. తొమ్మిదిరోజులు జరిపే పూజ వల్ల ఆరోగ్యపరంగా సత్ఫలితం కలుగుతుందని నమ్మటం మూఢనమ్మకం కాదు! శాస్త్రీయంగా ఇది నిజమే. వినాయక వ్రతం ఆచారం వెనుక ఉన్న ఆయుర్వేద పరమైన కారణం ఇది. వినాయకుని ఆరాధనలో ఆధ్యాత్మిక రహస్యాలు ఎన్నో ఉన్నాయని చెప్పేందుకు ఓ గొప్ప ఉదాహరణ ఆయన అవతారాలు. ముద్గల పురాణం ప్రకారం వినాయకుడు ఎనిమిది అవతారాలను ధరించాడు. వక్రతుండుడు; ఏకదంతుడు; మహోదరుడు; లంబోదరుడు; గజాననుడు; . వికటుడు; విఘ్నరాజు; . ధూమ్ర పర్ణుడు. ఈ పూజా సామాగ్రినంతా సిద్ధం చేసుకొని, మండపాన్ని ఏర్పరచి మట్టి వినాయకుడి విగ్రహాన్ని ఆవాహన చేసి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారు. స్వామికి ఇష్టమైన కుడుములు, అపూపములు, టెంకాయలు, పాలు, తేనె, అరటిపండ్లు, పాయసం, పానకం, వడపప్పు మొదలైన నైవేద్యాలు సమర్పించి, వ్రతకథను చదువుకొని, కథాక్షతలని శిరస్సున ధరించి, బ్రాహ్మణులను సత్కరించి, ఆనందంతో అందరు కలసి ప్రసాదాలని స్వీకరించి, గణేశ భజనలతో, కీర్తనలతో, పురాణశ్రవణంతో ఆయన మీదే మనసు లగ్నం చేసి, ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ పండగను జరుపుకుంటాము. వినాయక చవితి సందర్భంగా ఈ పండుగ ప్రాధాన్యతను, వినాయకుని విశిష్టతను ఏటా ఆచరిస్తుంటాం.

# ప్రకృతి పరిరక్షణ మన సంస్కృతి

## భారతీయతలో ప్రత్యేకత ఇదే!

## మనిషిని ఉన్నతుడిగా మార్చే ఆచారాలు

**తిరుమల,ఆగస్ట్26ఆర్ఎన్ఎ):** బారతీయ ఆధ్యాత్మిక విధానం మొత్తం ప్రకృతి చుట్టూ అల్లుకుని ఉన్నవే. ప్రకృతి ఆరాధన అన్నది కేవలం భారతీయ సంస్కృతిలోనే చూస్తాం. మన పండగలు పబ్బాలు కూడా వీటిచుట్టే పరిభ్రమిస్తాయి. పంచభూతాలైన భూమి,నీరు,గాలి, అగ్ని,ఆకాశం చుట్టూ తిరుగుతూ వాటిని పూజించే దిశగా సాగుతాయి. మన జీవన విధానానికి అవసరమైన ప్రతి ఒక్కటీ ప్రకృతి ఒడి నుంచి లభించేదే. అందుకే ప్రకృతిని దైవంలా భావించి పూజిండం చేస్తాం. వాటిని కాపాడుకునే క్రమంలో పూజిస్తాం. మన ప్రతి పండగా వీటికి మూలంగా ఉంటోంది. వినాయక చవితితేనే తీసుకుంటే ప్రకృతిని పూజించేదిగా చూడాలి. పుట్టినప్పటి నుంచి మరణించేవరకూ షోడశ సంస్కరణల ద్వారా మనకు రుజువర్తనను అలవడేలా చేసింది. మన భారతదేశానికి ఉన్న గొప్ప ఆధ్యాత్మిక సంపదే మనలను వసుదైక కుటుంబ దిశగా నడిపించింది. మన ఐతిహ్యంలో మాత్రమే ఈ విధానం కనిపిస్తుంది. ఇలా నిత్యజీవితంలో మనం ఆచరించే మంచి అంతా ఆధ్యాత్మికత కిందకే వస్తుంది. చిన్నప్పటి నుంచే పిల్లలకు రామాయణ, మహాభారత, భాగవతాల్లోని ఘట్టాలను వినిపించడం ద్వారా.. పెద్దల నుంచి నేర్చుకున్న సంస్కారాన్ని మన పిల్లలకు నేర్పడం ద్వారా మనకున్న గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తున్నాం. భవిష్యత్ తరాలు కూడా మన ఆధ్యాత్మిక సంపద విలువ తెలుసుకుని, ఆచరణలో పెట్టి ఆ వారసత్వాన్ని కొనసాగించాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు సాగిస్తున్నాం. మనిషి తాను బతుకుతూ ఇతరులను బతికేలా చేస్తూ ముందుకు సాగాలన్న ఓ మంచి ఆచారాన్ని మన పెద్దలు మనకు నేర్పారు. భక్తి, పూజలు,పునస్కరాలు అన్నీ ఇందులో ఇమిడి ఉన్నవే. ఆధ్యాత్మికత అంటే అది కేవలం భక్తి అనో, మతానికి సంబంధించిన అంశమో కాదని గుర్తించాలి. ఎవరైనా దీనిని ఆచరించడం అంటే మంచిని స్వీకరించిడం అని గుర్తించాలి. మానవ జీవన విధానాన్ని ఒక ఉత్తమమైన మార్గంలో నడిపే మార్గమే మన ఆధ్యాత్మికత అని గుర్తించాలి. పెద్దలు ఏదో చెప్పారని చేసే పూజలు మనకు అర్థమయ్యాక తత్వం బోధపడుతుంది. ఆధ్యాత్మికత అంటే ముక్కు మూసుకుని జపం చేయడం కాదు. మనం మంచి అలవాట్లకు దగ్గర కావడం అన్నది గుర్తించాలి. మనసు నిండా కోరికలతో పూజలు, జపాలు, తపాలు, యజ్ఞాలు, యాగాలు చేయడం కూడా మంచిని కాపాడడం ఎంతమాత్రమూ కాదు. ద్దలను గౌరవించడం, తోటివారికి చేతనైనంత సాయం చేయడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, ఆకలిగొన్నవారికి అన్నం పెట్టడం, మనకన్నా బలహీనులను హింసించకుండా ఉండడం.. ఇదంతా ఓమంచి ఆచారంగా చూడాలి. ప్రపంచంలో చాలా దేశాలు ఇప్పుడు తామెంతగా అభివృద్ధి చెందినా భారతీ సాంస్కృతిక జీవనం వైపు మొగ్గుచూపుతున్నారు. భారతీయ జీవన విధానానికి, మన సంస్కృతికి చేతులెత్తి మొక్కుతున్నారు. మన ఆధ్యాత్మిక జీవనవిధానం గురించి తెలుసుకున్న ఎందరో పాశ్చాత్యులు భారతదేశానికి వచ్చి ఇక్కడి సంస్కృతీసంప్రదాయాల గురించి తెలుసు కుంటున్నారు. పరిశోధనలు చేస్తున్నారు. దీనికి కారణం మనకున్న గొప్ప ఆధ్యాత్మిక సంపద మరే మతానికి లేదా దేశానికి లేకపోవడమే అని గుర్తించాలి. వేదాలు, అష్టాదశ పురాణాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురణాలు.. ఇలా మన ఆధ్యాత్మిక సంపద ఎంతో ఘనమైనదని గుర్తించారు. సృష్టి అంతా నిండి ఉన్న చైతన్యం ఒక్కటేనని.. ఆ చైతన్యమే పరమాత్మ అని మన సంస్కృతి చెబుతుంది. అందుకే సృష్టిలో ప్రతిదీ మనకు పూజనీయమే. మనం పుట్టినప్పటి నుంచి చనిపోయేవరకూ సౌకర్యవంతంగా, సుఖంగా జీవించ డానికి అవసరమైన వనరులను ఎన్నింటినో ఈ ప్రకృతి అందిస్తుంది. అందుకే మనం ప్రకృతిని తల్లిగా పూజిస్తాం. భూమిని దేవతగా గౌరవిస్తాం. ప్రాణాధారమైన నీటిని, గాలిని.. పంచభూతాలనూ దైవాలుగా భావించి కొలుస్తాం.

# గణపతికి అనేకచోట్ల ప్రత్యేక ఆలయాలు

**చిత్తూరు/ముంబై,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** వినాయకుడు విఘ్నాలను తొలగిస్తాడు కనుక ఆయనకే తొలిపూజ చేయడం ఆచారంగా వస్తోంది. విఘ్నేశ్వరుడు ప్రమథగణాలకు అధిపతి గనుక గణపతి అంటారు. అనేక పేర్లతో అలరారుతున్న గణనాధుడికి ప్రపంచ్యాప్తంగా పూజలు నిర్వహించడం హైందవ సంప్రదాయంలో భాగంగా మారింది. వినాయకుడికి ఎన్నో నామాలు ఉన్నట్లే, ఎన్నో రూపాలు కూడా ఉన్నాయి. వినాయకుడి కథ, వినాయక చవితి పూజావిధానం దాదాపు అందరికీ తెలిసినదే. వివిధ రూపాల్లో కొలువువుదీరే వినాయకుడికి ప్రత్యేక ఆలయాలు కూడా ఉన్నాయి. వరసిద్ధి వినాయక ఆలయం చిత్తూరు జిల్లా కాణిపాకం గ్రామంలో ఉంది. వరసిద్ధి వినాయకుడు ఇక్కడ స్వయంభువుగా వెలిశాడు. ఈ ఆలయంలో వినాయకుని విగ్రహం నేటికీ బావిలోనే కనిపిస్తుంది. ఈ ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు తమకు ఇష్టమైన పదార్థాన్ని స్వామివారికి వదిలిపెడితే కోరికలు తీరుతాయని నమ్మకం. అలాగే, కాణిపాకం వినాయకుడు సత్య ప్రమాణాల వినాయకుడిగా కూడా ప్రసిద్ధుడు. ఇక్కడ వినాయకుని ఎదుట ప్రమాణం చేసిన వారు సత్యమే పలకాలని, అసత్యం పలికిన వారికి అనర్థాలు తప్పవని కూడా భక్తులు నమ్ముతారు. సికింద్రాబాద్‌లో గణేశ్ ఆలయం ప్రసిద్ధి చెందింది. హైదరాబాద్‌లో అలా నాలుగైదు ఆలయాలు ప్రత్యేకంగా ఉన్నాయి. మహారాష్ట్రలోని ముంబైలో వరసిద్ధి వినాయకుడు కూడా బాగా ప్రసిద్ధి. ఇక్కడ వ్యాపారవేత్తలు తమారాధ్య దైవంగా కొలుస్తారు. కేరళలోని మధుర మహాగణపతి ఆలయం ఒకప్పుడు శివాలయం. పరమశివుడు మదరనాథేశ్వరునిగా ఇక్కడ వెలశాడు. స్వయంభువుగా వెలసిన శివలింగానికి తుళు రాజులు ఆలయం నిర్మించారు. మదరు అనే వృద్ధురాలు ఈ శివలింగాన్ని కనుగొనడంతో ఆమె పేరిట ఇక్కడి శివుడు మదరనాథేశ్వరునిగా ప్రసిద్ధి పొందాడని ప్రతీతి. మైసూరు రాజ్యాన్ని పరిపాలించిన టిప్పు సుల్తాను చాలా ఆలయాలపై దాడులు చేసినట్లుగానే ఈ ఆలయంపైనా దాడి చేయడానికి వచ్చాడని చెబుతారు. మూషిక వాహనుడైన వినాయకుడు నెమలి వాహనంపై కనిపించే అరుదైన ఆలయం ఇది. అందుకే ఇక్కడ వెలసిన వినాయకుడు మయూరేశ్వరుడిగా ప్రసిద్ధి చెందాడు. స్థానికులు 'మోరేశ్వర్' అని కూడా అంటారు. మయూరేశ్వరుడు వెలసినందున ఈ క్షేత్రానికి 'మోర్గాంవ్' అనే పేరు వచ్చింది.



ఇది మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఉంది. మహారాష్ట్రలో ప్రాచీన వినాయక క్షేత్రాలు ఎనిమిది ఉన్నాయి. వీటిని అష్ట వినాయక క్షేత్రాలని అంటారు. అష్ట వినాయక క్షేత్రాలకు తీర్థయాత్రగా వెళ్లేవారు మోర్గాంవ్‌లోని మయూరేశ్వరుడి దర్శనంతో యాత్రను ప్రారంభించడం ఆనవాయితీ. ఇకపోతే రాజస్థాన్‌లోని రణ్‌థాంబోర్ కోటలో ఉన్న ఈ ఆలయంలోని వినాయకుడిని 'ప్రథమ గణేశ' అని కూడా అంటారు. దేశంలో ఇదే మొట్టమొదటి వినాయక ఆలయంగా భావిస్తారు. ఈ ఆలయంలో వెలసిన త్రినేత్ర గణేశ విగ్రహం దాదాపు ఆరున్నర వేల ఏళ్ల కిందటిదని అంచనా. రుక్మిణీ కృష్ణుల వివాహం జరిగినప్పుడు వారు తొలి ఆహ్వాన పత్రికను ఇక్కడి ప్రథమ గణేశునికే పంపారని స్థలపురాణ కథనం. అప్పట్లో రణ్‌థాంబోర్ కోటపై అల్లాఉద్దీన్ ఖిల్జీ దాడి చేశాడు. మధ్యప్రదేశ్‌లోని పురాతన నగరమైన ఉజ్జయినిలో వెలసిన గణపతి ఆలయం ఇది. శైవక్షేత్రంగా, శక్తిపీఠంగా పేరుపొందిన ఉజ్జయినిలో వెలసిన ఈ గణపతి భక్తుల చింతలను తీర్చుతాడని, అందుకే ఇక్కడి గణపతిని చింతాహరణ గణపతి అని, చింతామణి గణపతి అని కూడా అంటారు. ఈ ఆలయంలోని గణపతి స్వయంభువుగా వెలిశాడు. వృద్ధి, సిద్ధి సమేతంగా భక్తులకు దర్శనమిస్తాడు. ఉజ్జయినిలోని మహాకాలేశ్వరుడిని, మహాకాళిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు మహాకాళేశ్వర ఆలయానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతామన్ గణపతి ఆలయాన్ని కూడా తప్పనిసరిగా దర్శించుకుంటారు. పాండిచ్చేరిలో ఉన్న గణేశాలయం కూడా బాగా ప్రసిద్ధి చెందిందినదే. ఇక్కడ నిత్య పూజలు జరుపుతుంటారు.

# తిరుపతిని మెగాసిటీగా మార్చే యత్నం

**తిరుపతి,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):**తుడా టవర్స్‌ను జూన్ ఆఖరు నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎపి పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. తిరుపతిని మెగాసిటీగా మార్చేందుకు యత్నిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో నిర్మాణాల అనుమతి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా టౌన్ ప్లానింగ్ నిబంధనలను సరళతరం చేశాం. నిబంధనలు పాటిస్తూ నిర్మాణాలు చేసుకుంటే అందరికీ మంచిది. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో క్రమపద్ధతి లేకుండా టౌన్ ప్లానింగ్ చేశారని విమర్శించారు. ఓ పట్టణంలో ఇంటింటి సర్వే చేపట్టగా.. లేఔట్స్, భవనాలు ఇష్టమొచ్చినట్లు నిర్మించినట్లు అందులో తేలిందన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌కు అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. టీడీఆర్ బాండ్లు రాష్ట్రంలో ప్రధాన సమస్య. తణుకులో రూ.50 కోట్ల విలువైన బాండ్లను రూ.750 కోట్లకే జారీ చేశారు.. తిరుపతిలో 1077 బాండ్లు వచ్చాయి. వీటిలో 709 మంజూరు చేశారు.. ఇంకా 368 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో న్యాయపరమైన సమస్యలతో 59 ఉన్నాయి. రాష్ట్రంలో విశాఖ, గుంటూరు, తిరుపతిలో ఎక్కువ టీ-డీఆర్ బాండ్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వీలైనంత తొందరగా క్లియర్ చేస్తాం' అని మంత్రి నారాయణ తెలిపారు.

31 ఆగష్టు - 06 సెప్టెంబరు, 2025 | జన విజయం | సంపుటి : 8 | సంచిక : 48 | ఖమ్మం
31 August - 06 September, 2025 | JANA VIJAYAM | Volume : 8 | Issue : 48 | KHAMMAM



# యువతలో స్వాతంత్ర్య చైతన్యం

## వినాయక ఉత్సవాలతో ఐక్యత    ఫలించిన తిలక్ ప్రయత్నం

**ముంబై,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** స్వాతంత్రోద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు వినాయక నవరాత్రలను బాలగంగాధర్ తిలక్ బాగా ఉపయోగించుకున్నారు. ప్రజలను భక్తిభావంతో ఏకం చేసి బ్రిటిషర్లకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపించారు. ఇందులో భాగంగా ఇంటికే పరిమితమైన గణపతి పూజను వీధివీధినా పూజలు అందుకునేలా చేశారు. ఇలా గణపతి నవరాత్రులుగా మలిచిన ఘనత లోకమాన్య బాలగంగాధర తిలక్‌కు దక్కింది. ఆనాడు ఉద్యమం కోసం ఉత్సవాల నిర్వహణ అవసర మయ్యింది. ఛత్రపతి శివాజీ పరిపాలనా సమయంలోనే మరాఠా రాజ్యంలో వినాయక ఉత్సవాలు ప్రారంభం అయ్యాయని కొందరు చరిత్రకారులు అంటారు. వినాయకుడిని పీష్వాలు తమ కులదేవుడిగా ఆరాధిస్తారు. కనుక 17వ శతాబ్దంలో శివాజీ చేతుల మీదుగా గణపతి నవరాత్రులు ప్రారంభమయ్యాయని కొందరి అభిప్రాయం. ఆయన స్ఫూర్తి కొనసాగింపుగా లోకమాన్య తిలక్ శివాజీ ఉత్సవాలు, గణేశ్ ఉత్సవాలను ప్రారంభించారని చారిత్రక అధ్యయనకారులు చెబుతారు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధాన్ని ధిక్కరిం చేందుకు, దైవభక్తికి,దేశభక్తిని జోడించిన అపురూప సందర్భం గణపతి నవరాత్రులు. వలస పాలనలో వివక్షకు గురవుతున్న భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పునరుద్ధరిం చేందుకు తొమ్మిది రోజుల వేడుక నిర్వహించాలన్న ఆలోచన చేయడం ఆనాడు అవసరమయ్యింది. జాతీయోద్య మంలో భాగంగా మహారాష్ట్ర పుణెలో 1893లో లోకమాన్య తిలక్ గణేశ నవరాత్రి ఉత్సవాలకు పిలుపునిచ్చారు. ఆ స్ఫూర్తి భాగ్యనగరానికీ వ్యాప్తి చెందింది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు గణపతి ఉత్సవాలు ఘనంగా సాగుతూ వచ్చాయి. దేశభక్తి, స్వాతంత్ర్య కాంక్షను సామాన్యుల్లో రగిలించేందుకు, గమ్యం తెలియని బాటసారిలా



అయోమయంలో ఉన్న యువతను ఒక సామాజిక లక్ష్యం దిశగా నడిపించేందుకు, 127 ఏళ్ల క్రితం మహారాష్ట్రలోని పుణె కేంద్రంగా సర్వ జనైక్య గణేశ్ ఉత్సవాలకు లోకమాన్య బాలగంగాధర తిలక్ పిలుపునిచ్చారు. గణపతి నవరాత్రులను సామాజిక వేదికలుగా మలిచారు. ఆ జాతియోద్యమ స్ఫూర్తి దేశవ్యాప్తంగా వ్యాపించింది. స్వరాజ్యం నా జన్మహక్కు అని నినదించిన తిలక్ పిలుపుతో కొందరు భాగ్యనగరవాసులు ముందుకొచ్చారు. నగరంలో స్థిరపడిన కొందరు మహారాష్ట్రీయులు సామూహిక వినాయక పూజకు నాంది పలికారు. అలా హైదరాబాద్‌లోని గణపతి ఉత్సవాల శోభ ప్రారంభమయ్యింది. అప్పట్లో చెరువుల్లోని నల్లమట్టినే వినాయక ప్రతిమల తయారీకి వాడేవారు. చవితినాడు మట్టిగణపయ్యను ప్రతిష్ఠించి, తొమ్మిది రోజుల పాటు తొలి, మలి సంధ్యా సమయాల్లో పూజ కార్యక్రమాలు నిర్వహించేవారు. సాయంత్రం వేళల్లో 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జానపద నృత్యాలు, గీతాలాపన, భక్తి కీర్తనలు, భజన, పారాయణం, పద్య, ఇతిహాస నాటకాలు, సంగీత కచేరీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చేవారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు, ధనిక, పేద తేడా లేకుండా అందరూ ఆ కార్యక్రమాలు చూసేందుకు పెద్ద ఎత్తున మండపాల వైపు తరలి వచ్చేవారు. ఆ పూజా కార్యక్రమాలు, కళా ప్రదర్శనలే దేశ సమైక్యతకు స్ఫూర్తిగా నిలిచేది. అలాంటి పరిస్థితులలోనూ నిజాం ప్రభుత్వం సమ్మతిం చేలా గణపతి నవరాత్రులు నగరంలో జరగడం విశేషం. భారత గుణవర్ధిని సంస్థ ఆధ్వర్యంలో ఏటా వినాయక నవరాత్రుల సందర్భంగా పదిరోజులపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో నిర్వహిస్తున్నారు. ఇరవై శతాబ్దం ప్రారంభంలో శాలిబండ నుంచి నగరంలో మరికొన్ని ప్రాంతాలకు గణేశ్ ఉత్సవాలు విస్తృతమయ్యాయి. చార్మినార్ పరిసరాల్లోని దివాన్ దేవిడి ప్రాంతంలోని దీక్షిత్ వాడ, కోఠిలోని మహారాష్ట్ర గ్రంథ సంగ్రహా లయ్, సుల్తాన్ బజార్ మహారాష్ట్ర మండల్, కాచిగూడ, హరిబౌలి, నాంపల్లి తదితర ప్రాంతాల్లో గణపతి నవరాత్రి సామూహిక ఉత్సవాలు మొదలయ్యాయి. పండుగ పది రోజులూ ఆ ప్రాంత వీధులన్నీ కోలా హలంగా ఉండేవి. ఆ ప్రాంతాలలో మహారాష్ట్రీయులు ఎక్కువ మంది ఉండేవారు. తొమ్మిది రోజుల పాటూ రోజూ సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు కుటుంబంతో సహా వెళ్లేవాళ్ళు. రెండు కళ్లు చాలవు అన్నంతగా సంబరాలు జరిగేవి. పదో రోజు తెల్లవారుజామున పిల్లలు, పెద్దలు అంతా కలిసి మట్టి గణపతిని ఊరేగింపుగా తీసుకెళ్లి మూసీలో నిమజ్జనం చేసేవాళ్లు.

# భాగ్యనగరంలో ఉత్సవాలకు ప్రత్యేకత

## ఖైరతాబాద్ గణపతికి పెరుగుతున్న ఆదరణ

## వేలంలో బాలాపూర్ లడ్డూ ప్రత్యేకం

**హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** గణేశ్ ఉత్సవాల పేరెత్తగానే మహారాష్ట్ర తరవాత హైదరాబాదే గుర్తుకు వస్తుంది. హైదరాబాద్‌లో ఈ ఉత్సవాలకు అంతటి ఘనత ఉంది. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి. ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించు కునేందుకు ఏటా లక్షల్లో జనం తరలి వస్తారు. ఇక్కడ ఏటా ఓ రకమైన వినాయకుడి ప్రతిమను తయారు చేస్తున్నారు. మట్టి గణపతికి ప్రాధాన్యం పెరిగింది. బాలాపూర్ లడ్డూ వేలానికి ప్రతీక.ఇలా అనేక ప్రత్యేకతలు వినాయక ఉత్సవాల్లో ఉన్నాయి. నిమజ్జనం కూడా జంటనగరాల్లో బహుళ ప్రాచుర్యం పొందింది. హైదరాబాద్‌లోని కొన్ని వినాయక మండపాలలో లంబోదరుడి లడ్డూ ప్రసాదాన్ని కొందరు ముస్లిం, క్రిష్టియన్లూ వేలంపాట ద్వారా దక్కించుకోవడం అందుకు తార్కాణం. అంతేకాదు, చార్మినార్ తదితర ప్రాంతాలలో గణపతి శోభాయాత్ర సమయంలో కొందరు ముస్లింలు ఎదురెళ్లి భక్తులకు మంచినీరు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన సందర్భాలెన్నో. రాజా బహద్దుర్ వేంకటరామారెడ్డి హైదరాబాద్ కొత్వాల్‌గా బాధ్యతలు నిర్వర్తి స్తున్న సమయంలో గణపతి శోభాయాత్రలో చిన్నపాటి సమస్య తలెత్తింది. ఆ సమయంలో ఒక ఉన్నత పోలీసు అధికారిగా ఆయన అనుసరించిన వ్యూహం నేటి పోలీసులకూ ఆదర్శనీయం. గణపతి నిమజ్జనం సమయంలో కొందరు పోలీసులే భక్తులతో గొడవపెట్టు కున్నారు. దాంతో, ఊరేగింపు నడిరోడ్డుపై నిలిచింది. భక్తులు వినాయకుడి శోభాయాత్ర పల్లకిని నడిరోడ్డుపై దింపేశారు. ఆ సంగతి తెలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న కొత్వాల్, సమస్యకు కారణమైన పోలీసు జవానులను మందలించారు. అయినా భక్తులు వాదులాట ఆపలేదు. దాంతో వేంకటరామారెడ్డి స్వయంగా వినాయకుని ఊరేగింపు పల్లకిని భుజానికెత్తుకోబోయారు. అప్పుడుగానీ పరిస్థితి సద్దుమణగలేదు. నిమజ్జనం ప్రశాంతంగా సాగింది. ఆ సంఘటన తాలూకూ విషయాలు కొత్వాల్ వేంకటరామారెడ్డి జీవిత చరిత్ర ద్వారా తెలుస్తాయి. నగరంలో వినాయకచవితి జోష్ నెలకొంది. రోడ్ల నిండుగా విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహం వద్ద ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాలు తొలిసారిగా పాతబస్తీలోని శాలిబండ ప్రాంతంలో ప్రారంభ మయ్యాయి. కులమతాలకతీతంగా అందరూ కలిసి గణపతి మండపాలను నెలకొల్పడం, తద్వారా రాజకీయ చర్చలు, స్వాతంత్య స్ఫూర్తిని యువతలో ప్రేరేపించే సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే క్రతువుకు శ్రీకారం జరిగింది. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు, ధనిక, పేద తేడా లేకుండా అందరూ ఆ కార్యక్రమాలు చూసేందుకు పెద్ద ఎత్తున మండపాల వైపు తరలి వస్తారు. ప్రారంభంలో శాలిబండ నుంచి నగరంలో మరికొన్ని ప్రాంతాలకు గణేశ్ ఉత్సవాలు విస్తృతమయ్యాయి. తొమ్మిది రోజుల పాటూ రోజూ సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు జరిపంచేవారు.

# గణేశ ఉత్సవాలతోనే ప్లాస్టిక్ నిషేధం

## ప్రజలకు పర్యావరణవేత్తల పిలుపు

**హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ రహితంగా ఉత్సవాలను జరుపుకోవాలన్న ప్రతిన తీసుకుంటే మన భూమిని మనం కాపాడుకుంటామని అంటున్నారు. భూసారాన్ని దెబ్బతీస్తున్న పాలిథిన్ వినియోగాన్ని తగ్గించాలని కోరుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో వాటి వినియోగాన్ని నియంత్రించలేక పోతున్నారు. ఇందుకు ఉద్యమ తరహా మార్పు అవసరమని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. స్వచ్ఛభారత్ అమలు చేస్తున్నా గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగంపై నిసేధం అమలు కాకపోవడంతో తీవ్ర కాలుష్యం ఏర్పడుతోంది. అయితే కరోనా ఎఫెక్ట్‌తో ప్రపంచం మొత్తంగా పర్యావరణహితంగా ప్లాస్టిక్ వాడకమూ తగ్గింది. ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను జార విడుస్తున్న కారణంగా భూమిలో అవి కరగక కాలుష్యం ఏర్పడుతోంది. భూమిలో అది చేరి వాతావరణ కాలుష్యాన్నిపెంచుతోంది. కేన్సర్ వ్యాధి వ్యాప్తికి, వాతావరణం కాలుష్యానికి కారణమౌతున్న ప్లాస్టిక్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది. గ్రామాల పరిధిలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనికితోడు చెత్త శుద్ధి లోపించడంతో ప్రధాన రహదారుల్లో దుర్వాసన వెదజల్లుతోంది. పెళ్లిళ్లు, పండుగలు, పార్టీల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల ను వినియోగిస్తున్నారు. వినియోగం అనంతరం రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో గుట్టలుగా పడేసి చేతులు దులుపుకుంటున్నారు. వాతావరణాన్ని కలుషితం చేసి మన ప్రాణాలను హరిస్తున్నాయన్న విషయం గుర్తించ లేకపోతున్నాం. గుట్టలు గుట్టలుగా పడిఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా భావించి తింటున్న పశువులు, జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, సీసాలను తరచూ వినియోగిస్తూ కేన్సర్ వ్యాధి సోకే లక్షణాలు అధికంగా ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న పిల్లలకు కూడా సోకే అవకాశం అధిక శాతం ఉందని సూచిస్తున్నారు. వినియోగం విపరీతంగా పెరిగి పోవడంతో కాలువలు, డ్రెయిన్లు, ఖాళీ ప్రదేశాలు, డంపింగ్‌యార్డుల్లో గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి. డిస్పొజల్ వస్తువుల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. దీంతో పలువురు వ్యాపార స్తులు టన్నుల కొద్ది నిల్వ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. పలువురు వ్యాపారులు షాపుల ముందు, ఆరుబయట గుట్టలుగా పేర్చి విక్రయాలు నిర్వహిస్తున్నారు.

ఆఖరకు కాఫీ హోటళ్లలో కూడా ప్లేట్లలో అరటి, ఇతర ఆకులకు బదులుగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. ఆహార పదార్థాలు ప్యాకింగ్‌కు సైతం వీటిని వాడుతున్నారు. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై జిల్లా కలెక్టర్ తహశీల్దార్లకు పూర్తి అధికారాలు ఇచ్చారు. అమ్మినా, కొనుగోలు చేసినా, వినియోగించినా, ఎక్కడబడితే అక్కడ వేసినా రూ.ఐదు వేల నుంచి రూ.25 వేల వరకూ జరిమానా విధిస్తారు. విక్రయ షాపులపై దాడులు చేసి వస్తువులను స్వాధీనం చేసుకోవడం, షాపులను సీజ్ చేయడం వారిపై కేసులు నమోదు చేసే అధికారం తహశీల్దార్లకు ఉంది. ముడుపులకు లొంగి చూసీ చూడనట్లు వ్యవహరించడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో పేపర్ గ్లాసులు, పేపర్ కవర్లు, ప్లేట్లు దర్శనమిస్తున్నా వివాహాది శుభకార్యాల్లో కూడా ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉంటుంది. దీనిపై మరలా అధికారులు విస్తృత ప్రచారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలు అమల్లో ఉన్నా అమలు కావడం లేదు. అధికారుల ఉదాశీనత, వినియోగదారుల అవగాహనలేమితో విచ్చలవిడిగా వినియోగం కొనసాగుతూనే ఉంది. దీంతో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎక్కడ చూసినా కాలువలు, డ్రెయిన్లు వీటితో నిండిపోతున్నాయి. హరిత ఉద్యమం లాగే ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమంగా సాగితే తప్ప నిషేధం అమలు జరగదని అంటున్నారు. గణేశ్ ఉత్సవాల్లో దీనిని ఓ సవాల్‌గా తీసుకోవాలని సూచిస్తున్నారు.

# భారీ ఖైరతాబాద్ గణేశుడు

## మట్టితో పాటు సంప్రదాయ రంగులు

## నేడు పూజలతో అంకురార్పణ



**హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** వినాయకచవితి అనగానే ఖైరతాబాద్ గణేషుడే గుర్తుకు వస్తాడు. ఈసారి కూడా ఖైరతాబాద్ వినాయకుడు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాడు. భారీ గణపతిని మట్టితో చేశారు. గణేష్ విగ్రహం తయారీ పూర్తి అయింది. ఏటా హైదరాబాద్‌లో ఎటు చూసినా వినాయకచవితి సందడే కనిపించేది. వినాయకచవితి అంటేనే బోలెడంత జోష్ ఉండేది. చిన్నా, పెద్దా అనే తేడా లేదు. గల్లీ గల్లీలోనూ ఎక్కడ చూసినా గణపయ్య పేరే వినిపించేది. హైదరాబాద్‌లో వినాయకచవితి పండగ ప్రత్యేకతే వేరు. విగ్రహం ప్రతిష్టాపన దగ్గర నుంచీ నిమజ్జనం వరకూ అంతా భక్తి భావంతో ఉప్పొంగిపోతారు. ఘనంగా జరుపుకునేందుకు ఆరాటపడతారు. తమకు తోచిన విధంగా విగ్రాహాలు ప్రతిష్టించేందుకు ఆసక్తి చూపిస్తారు. రెండు, మూడు వారాల క్రితం నుంచే వినాయకచవితి ఉత్సవాల కోసం ఏర్పాట్లు మొదల య్యాయి. ఈసారి కూడా గణేష్ పండుగ కోసం ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ముఖ్యంగా ఖైరతాబాద్ గణేష్ ప్రత్యేకాకర్శణ. ప్రతి ఏడాది విశేష అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చే ఖైరతాబాద్ గణపతి ఈసారి మరింత శోభాయమానంగా తయారయ్యాడు. వినాయకుడిని పూజిస్తే లోకకల్యాణం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని నమ్మకం. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు, సిఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానాలు అందించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందచేశారు.

# అక్రమార్జనపై ఉద్యోగుల మక్కువ

**హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** ప్రభుత్వ శాఖల్లో అవినీతి వేళ్లానుకుంది. రెవెన్యూశాఖలో పాసుపుస్తకాలు మొదలుకొని ఇతర అన్ని సేవలకు ఉద్యోగులు, అధికారులు లంచం తీసుకుంటున్నారని ఎంతోమంది బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో తెలంగాణలో దాడులు పెరిగాయి. ఫిర్యాదు రావడమే ఆలస్యం ..ఎసిబి స్పందించి వలపన్నుతోంది. ఎందరో చిక్కుతున్నారు. మరెందరో తప్పించుకుంటున్నారు. ప్రజల పన్నులతో జీతాలు పొందుతున్న ఉద్యోగులు ప్రజలకు పనులు చేసి పెట్టకుండా లంచాలు మేస్తున్నారు. రెరా అధికారి బాలకృష్ణ మొదలు అనేకమంది పట్టుబడ్డారు. నీటిపారుదల శాఖలో తిమింగలాలు పట్టుబడ్డాయి. వందలకోట్లు అప్పనంగా సంపాదించినా నాయకులు, ఉద్యోగులు అక్రమాస్తులపై మక్కువ వదలడంలేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్రో ఎక్కడ చూసినా ఎసిబి కేసులు నిత్యం నమోదవుతూనే ఉన్నాయి. రాజకీయ నాయకులు, అధికారులు బినామీల పేరుతో ఆస్తులు కూడగడుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు ఈ విషయాలను పెద్దగా పట్టించుకోక పోవడం గమనార్హం. రాజకీయ నాయకులు కూడా ఆస్తుల వివరాలు ప్రకటించాల్సి ఉన్నా కొందరు మాత్రమే వెల్లడిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ నాయకులు వారితోపాటు వారి కుటుంబసభ్యుల ఆస్తుల వివరాలు నామినేషన్ సమయంలో అఫిడవిట్‌లో వివరించాల్సి ఉంటుంది. పలు పార్టీల్లో ఉన్న కొందరు రాజకీయ నేతలు ప్రజాప్రతినిధులు ఎన్నికైన తర్వాత అక్రమార్జనతో కోట్లకు పడుగలెత్తారు. గుత్తేదారుల నుంచి పర్సెంటేజీలు మొదలుకొని ప్రభుత్వ, ఆస్తులను అక్రమించుకొనే వరకు మరీ అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి రిజిస్ట్రేషన్‌కు మామూళ్లు వసూలు చేస్తున్నారని విమర్శలు లేకపోలేదు. ఇది నిజమని తెలిసినా వారిని ఎవరూ అడ్డుకోవడం లేదు. నిషేధిత ఆస్తులు సైతం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి కొందరు కోట్లు సంపాదించిన ఉదంతాలు ఉన్నాయి. ఈ శాఖలో ఉద్యోగుల బదిలీల్లోనూ అక్రమాలకు పాల్పడిన ఉదంతం మనకు తెలిసిందే. నీటిపారుదలశాఖ, రోడ్లు భవనాలశాఖ, పంచాయతీరాజ్‌శాఖ, నగరపాలకసంస్థ, పురపాలకలు, విద్యుత్‌శాఖ పరిధిలో జరిగే ప్రతి పనుల్లో అధికారులు, ఉన్నతాధికారులు, నేతలకు పర్సెంటీజీలు అందుతాయనేది బహిరంగ రహస్యమే. పోలీసుశాఖ లో నెలసరి మద్యం మామూళ్లు, కేసుల వ్యవహారాల్లో వసూళ్ల దందా మామూలై పోయిందని బాధితులు వాపోతున్నారు. ఇలా ప్రతిశాఖలోనూ అవినీతి, అక్రమాల పలు పంథాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు, ఉన్నతాధికారులు కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. అక్రమాస్తులు కూడగడితే శిక్ష తప్పదని కోర్టు మరోమారు రుజువు చేసినా అక్రమార్కులు తమ చేతులు తడపనిదే పనులు చేయడం లేదు. మద్య నిషేధ, అబ్కారీశాఖలో కానిస్టేబుళ్లు మొదలు కొని ఉన్నతాధికారుల వరకు నెలసరి మామూళ్లు పుచ్చుకుంటున్నారు. అక్రమార్కులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని రుజువు చేస్తున్నా ఉద్యోగుల తీరు మారడం లేదు. ఇకపోతే నాయకులు కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడుతున్నారు. ఇలా అక్రమంగా సంపాదించే ప్రతిఒక్కరూ ఆలోచించాల్సిన తరుణమిది. ఇలా అక్రమాస్తుల కేసుల్లో పట్టుబడిన వారు ప్రతి జిల్లాలోనూ ఉన్నారు. వీరి కేసులు ప్రస్తుతం న్యాయస్థానాల పరిధుల్లో ఉన్నాయి. ప్రసుతం కేసులన్నీ కోర్టు విచారణలో ఉన్నాయి. పలువురు అవినీతి ఉన్నతాధికారుల పైన గతంలోనూ కేసులు నమోదయ్యాయి. అయితే అక్రమాస్తుల సంపాదనకు నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి విశ్వరూపం దాలుస్తోందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వశాఖలో ఉద్యోగిగా చేరే వ్యక్తి మొదట తన ఆస్తుల వివరాలు ప్రభుత్వానికి తెలియజేయాలి. లేదంటే ఉద్యోగంలో చేరిన తర్వాత వచ్చే మొదటి జనవరి నెలాఖరులోగా తెలియపరచాల్సి ఉంటుంది. లక్షరూపాయలకు మించి విలువ చేసే బంగారు, వాహనం ఇతర చరాస్తులు కొన్నట్లయితే ఉన్నతాధికారులకు తెలియజేయాలి. స్తిరాస్థి విషయంలో అడుగుస్థలం కొనుగోలు చేసినా తెలియపరిచాల్సిందే. ఇల్లు కట్టుకుంటున్నట్లయితే ముందుగా చెప్పాలి. ఈ నిబంధనలు పాటించకుండా స్థిర,చరాస్థులు కొన్నట్లయితే అక్రమ ఆస్తులుగా పరిగణిస్తారు. అయితే ప్రభుత్వ ఉద్యోగంలో చేరేటప్పుడు ఎవరూ స్థిర, చరాస్తుల వివరాలు ఇవ్వడం లేదు. కొత్తగా సంపాదించిన ఆస్తుల వివరాలు ఏ ఉద్యోగి వెల్లడించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల్లో ఆన్‌లైన్ విధానం అమలు పరచడం ద్వారా అవినీతి తగ్గించే యత్నం చేస్తోంది. అయితే ఎంతవరకు సత్ఫలితం ఇస్తుందో చూడాలి.

# గణేశ మండపాలకు ఉచిత విద్యుత్

**అమరావతి,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** వినాయక చవితి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పండుగను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా గణేష్ ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వినాయక చవితి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో పందిళ్లకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు నిర్వాహకులు మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మంత్రి లోకేష్ మాట్లాడారు. ఏపీ వ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 15వేల గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. గణేష్ ఉత్సవ పందిళ్లకు ఉచిత విద్యుత్ అందించడానికి రూ.25 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ భారం మొత్తాన్ని ఏపీ ప్రభుత్వం భరించాల్సి ఉంది. ఏపీలోని కోట్లాది మంది గణేష్ భక్తుల సౌలభ్యం దృష్ట్యా ఉచిత విద్యుత్ అందించేలా చూడాలని మంత్రి లోకేష్ వినతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ప్రత్యేకంగా జీవో విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే విజయదశమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గాదేవి మండపాలకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ అందించడానికి రూ. 25 కోట్ల ఖర్చును ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని కోట్లాది గణేశ్ భక్తుల సౌలభ్యం దృష్ట్యా ఉచిత విద్యుత్ అందించేలా చూడాలని మంత్రి లోకేశ్ చేసిన వినతిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

31 August - 6 September, 2025_Layout 1 8/29/2025 8:38 PM Page 4



# తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా

## యూనివర్సిటీ అభివృద్ధి అధ్యయనానికి ఇంజనీర్స్ కమిటీ ఓయూలో వసతి గృహాలను ప్రారంభించిన సిఎం రేవంత్

**హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా యూనివర్సిటీ అని, రెండూ అవిభక్త కవలల్లాంటివని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చదువుతోపాటు పోరాటాన్ని నేర్పించే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు.. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది కూడా ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు. ఉస్మానియా వర్సిటీలో రూ.90 కోట్లతో నిర్మించిన భవనాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దుందుభి, భీమా వసతి భవనాలను ప్రారంభించిన అనంతరం.. డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, కోదండరామ్, ఓయూ వీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించిన సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు.. ఉస్మానియా యూనివర్సిటీని కాలగర్భంలో కలపాలని చూశారని మండిపడ్డారు. కానీ ఓయూకు పూర్వ వైభవం తీసుకురావాలని తాము నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆ క్రమంలో 108 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీకి దళితుడిని వీసీ చేసి చూపించామన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా వర్సిటీనేనని గుర్తు చేశారు. యూనివర్సిటీలు సమస్యలపై చర్చలకే కాదు..సైద్ధాంతిక అంశాలకు వేదిక సైతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక, సాంకేతిక అంశాలపై చర్చలు జరపాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. 1938 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ ఇది.. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన శివరాజ్ పాటిల్, పీవీ నర్సింహారావు ఈ యూనివర్సిటీ విద్యార్థులే.. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి ఈ యూనివర్సిటీ విద్యార్థినే.. తెలంగాణ నలుమూలలా ఏ సమస్య వచ్చినా మొదట చర్చ జరిగేది యూనివర్సిటీలోనే..అని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారిది ఉస్మానియా యూనివర్సిటీనే.. యాదయ్య, ఇషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర సాధనలో సమిధలయ్యారు.. ఎంతో మంది మేధావులను అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీది.. గత పదేళ్ల పాలనలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్ర జరిగింది.. ఉస్మానియా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావాలని మేం ఆలోచన చేశాం.. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించాం.. చదువుకుని చైతన్యం ఉన్న వారిని వీసీలుగా నియమించాం.. తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచే మేధా సంపత్తిని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆశిస్తున్నాం.. అన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరం.. దేశంలో 60 శాతం జనాభా 35 ఏళ్ల లోపు వారే.. ఇది మన దేశ సంపద.. 21 ఏళ్ల వయసులో దేశానికి సేవలందిస్తున్నప్పుడు.. 21 ఏళ్ల యువకులు శాసన సభలో ఎందుకు అడుగుపెట్టకూడదు?.. తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఆవేదన కలుగుతోంది.. యువతను గంజాయి, డ్రగ్స్ వ్యసనాలు పట్టి పీడిస్తున్నాయి.. గంజాయి, డ్రగ్స్ యువతను నిర్వీర్యం చేస్తున్నాయి.. ఆ వ్యసనాల నుంచి యువతను బయటపడేలా చేయాలి.. చదువు, చైతన్యం ఉంటేనే సమాజంలో రాణిస్తారు.. నా దగ్గర పంచడానికి భూములు లేవు, ఖజానా లేదు మీకు నేను ఇవ్వగలిగింది విద్య ఒక్కటే.. అన్నారు. మీ తలరాతలు మార్చేది చదువొక్కటే.. చదువు ఒక్కటే మిమ్మల్ని ధనవంతుల్ని చేస్తుంది, గుణవంతులను చేస్తుంది.. పేదరికం మాకు కొత్త కాదు.. ఆ పేదరికాన్ని చూసి వచ్చినవాళ్ళం.. పేదరికాన్ని పారద్రోలడం మాకంటే ఎక్కువ ఎవరికీ తెలియదు.. యూనివర్సిటీ అభివృద్ధి అధ్యయనానికి ఇంజనీర్స్ కమిటీ వేయాలని అధికారులను ఆదేశిస్తున్నా.. ఉస్మానియా యూనివర్సిటీని స్టాన్ ఫర్డ్, ఆక్స్ ఫర్డ్ స్థాయిలో తీర్చిదిద్దుతాం.. ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలవాలి.. ఉస్మానియా యూనివర్సిటీ లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదు.. యూనివర్సిటీ అభివృద్ధికి ఏం కావాలో అడగండి.. అంచనాలు తయారు చేసి ఇవ్వండి..అని అన్నారు. మళ్లీ యూనివర్సిటీకి వస్తా.. ఆర్ట్స్ కాలేజీ వద్ద మీటింగ్ పెట్టి నిధులు మంజూరు చేస్తా..పోలీసులకు నేను ఆదేశిస్తున్నా.. ఆ రోజు యూనివర్సిటీలో ఒక్క పోలీస్ కనిపించొద్దు.. నిరసన తెలిపే వారిని నిరసన తెలపనివ్వండి.. నేను రావొద్దని అడ్డుకునే వారికి సమాధానం చెప్పే చిత్తశుద్ధి నాకుంది.. కొంతమంది రాజకీయ నాయకులకు పదవులు పోయాయన్న ఆవేదన ఉంటుంది.. వాళ్ల కొడుకులను ఏదో చేద్దామనుకుంటే ఏదో అవుతున్నారని బాధ ఉంటది.. వారి ఉచ్చులో మీరు పడొద్దు.. సమస్య ఉంటే మాకు చెప్పండి.. మా మంత్రులు మీకు అందుబాటులో ఉంటారు.. కోదండరామ్ సార్ పై కుట్ర చేసి సుప్రీం కోర్టుకు వెళ్లి పదవి తొలగించారు.. ఇదేం పైశాచిక ఆనందం.. మళ్లీ కోదండరాం సార్ కు ఎమ్మెల్సీ ఇస్తాం..అని ప్రకటించారు. అపోహలకు లోను కాకండి.. అబద్ధాల సంఘం చెప్పే మాటలు నమ్మొద్దు..వాట్సాప్, సోషల్ మీడియాలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో సెంట్రల్ యూనివర్సిటీలో సింహాలు, ఏనుగులు ఉన్నాయని ప్రచారం చేసి అడ్డుకున్నారు.. తెలంగాణలో సింహాలు, ఏనుగులు లేనేలేవు.. మానవ రూపంలో ఉన్న మృగాలు ఉన్నాయి.. వాళ్లు తెలంగాణ సమాజానికి పట్టిన చెదలు లాంటివారు.. వాళ్లు తెలంగాణ సమాజం బాగు కోరుకోరు.. వాళ్లు మళ్లీ వస్తే ఉస్మానియా యూనివర్సిటీని ఉండనివ్వరు.. మీ చదువుకు ఏం కావాలో అడగండి.. ఉస్మానియా యూనివర్సిటీని అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ తెలిపారు.



# ప్రొ. కోదండరామ్‌ను మళ్లీ ఎమ్మెల్సీచేస్తాం

## సుప్రీం కోర్టుకు వెళ్లి పదవిని రద్దు చేయించారు

## ఓయూ పర్యటనలో బిఆర్ఎస్ నేతలపై రేవంత్ ఫైర్

**హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** ప్రొఫెసర్ కోదండరామ్‌ను మరో 15 రోజుల్లో మళ్లీ ఎమ్మెల్సీని చేసి శాసన మండలికి పంపిస్తానని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. తమ ప్రభుత్వం ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా చేసిందని గుర్తు చేశారు. కానీ బీఆర్ఎస్ నేతలు.. సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఆయన పదవిని తీయించేశారని విమర్శించారు. ప్రొ. కోదండరామ్ ఎమ్మెల్సీ పదవిని ఊడకొట్టేందుకు రూ. కోట్లు ఖర్చు చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. గత పదేళ్లలో యూనివర్సిటీని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. అయినా.. ఎందుకు అంత శునకానందం మీకు అంటూ.. బీఆర్ఎస్ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది ఈ యూనివర్సిటీనే అని వివరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారిది ఉస్మానియా యూనివర్సిటీనే అని తెలిపారు. అలాగే యాదయ్య, ఇషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు రాష్ట్ర సాధనలో భాగంగా సమిధలయ్యారని పేర్కొన్నారు. ఎంతో మంది మేధావులను అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీదన్నారు. గత పదేళ్ల పాలనలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్ర జరిగిందంటూ మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావాలని తాము ఆలోచన చేశామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించామని గుర్తు చేశారు. చదువుకుని చైతన్యం ఉన్న వారిని వీసీలుగా నియమించామని వివరించారు. అనంతరం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో విద్యార్థులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీలు ప్రొ. కోదండరామ్,అమీర్ అలీఖాన్ సభ్యత్వాన్ని సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. వీరిద్దరిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించారు. అయితే వీరి నియామకాలపై బీఆర్ఎస్ నేత దాసోజ్ శ్రవణ్, సత్యనారాయణలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలుగా వీరిద్దరి నియామకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ నేపథ్యంలో మరో 15 రోజుల్లో ప్రొ. కోదండరామ్‌ను ఎమ్మెల్సీని చేసి శాసన మండలికి పంపుతానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# జగన్ అక్రమాస్తుల కేసులో వాన్‌పిక్‌కు చుక్కెదురు

## ఛార్జిషీటులో పేరును తొలగించాలన్న పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ ఛార్జ్‌షీట్ నుంచి తమ సంస్థ పేరును తొలగించాలంటూ వాన్‌పిక్ దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గతంలో వాన్‌పిక్ పేరును సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. ప్రస్తుతం ఈ కేసు నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణలో ఉంది. అయితే, 2022 జులైలో వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను అనుమతించారని వాదించింది. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం మరోసారి పిటిషన్‌ను విచారించాలని హైకోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో మరోసారి వాన్‌పిక్ ప్రాజెక్టుపై వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. పిటిషన్‌ను కొట్టివేసింది.

# ఆమె ఓ అవినీతి అనకొండ - భూమన వీడియో విడుదల

## తాటకిలా అందరినీ తొక్కి పెట్టారు డబ్బు సంపాదనే ధ్యేయంగా పరిపాలన మంత్రులను కూడా లెక్కచేయని వైనం

**తిరుపతి,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో అవినీతికి పాల్పడి అరెస్టు అయిన ఓ మహిళా అధికారిణపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యాలు చేశారు. ఆమె అవినీతిలో అనకొండ లాంటిదని తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుపతిలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై మంత్రి నారాయణ చేసిన కామెంట్స్ నేపథ్యంలో భూమన కరుణాకర్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు ఓ వీడియోను విడుదల చేశారు. సదరు అవినీతి అధికారి గతంలో మంత్రులను సైతం పూచికపుల్లలా చూసిందన్నారు. కనీసం తన శాఖకు సంబంధించిన మంత్రులను కూడా లెక్క చేయదంటూ ఆమె తీరును తప్పుపట్టారు. ఆమెకు డబ్బులు సంపాదించడమే తప్ప ఎలాంటి నైతిక విలువలు లేని అధికారని, తాటకి లాగా కింది స్థాయి అధికారుల పట్ల వ్యవహరించారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో తాము రోడ్లు వేస్తున్న సమయంలో అ అధికారి టీడీఆర్ బాండ్ల ద్వారా వందల కోట్లు కొట్టేయాలనే ప్లాన్ వేస్తే దానిని తాము అడ్డుకున్నామని, ఇది తట్టుకోలేక ఆమె నెల్లూరు జిల్లా నేతలకు తాము రెండు వేల కోట్లు దోచుకున్నా మంటూ ప్రచారం చేయించిందన్నారు. ఆ అధికారి గత 35 ఏళ్లుగా ఎక్కడ పనిచేసినా అవినీతికి పాల్పడుతూ వందల కోట్లు దోచుకుందని ఆరోపించారు. మీ అవినీతి గురించి మాకు బాగా తెలుసు అని అత్యున్నత న్యాయస్థానం సైతం ఆమె గురించి వెటకారంగా చెప్పిందన్నారు. రోజూ ఆమె ధరించే చీర లక్షన్నర రూపాయలు అని.. 50 లక్షల రూపాయలకంటే విలువైన విగ్గులు ఆవిడకు 11 ఉన్నాయి అని.. ఒక్కో రోజు ఒక్కో విగ్గుతో దర్శనమిస్తుంటారంటూ భూమన సంచలన వ్యాఖ్యలు చేశారు. వైకాపా హయాంలో ఆ అధికారిణి పురపాలక శాఖ బాధ్యతలను పర్యవేక్షించారు. తన శాఖ మంత్రులను సైతం లెక్కచేయలేదు. డబ్బు సంపాదించడమే తప్పు.. ఏ నైతిక విలువలూ లేని మనిషి. ఒక్క మాటలో చెప్పాలంటే ఓ తాటకిలా కింది అధికారుల పట్ల ఆమె వ్యవహరించారని భూమన తీవ్ర విమర్శలు చేశారు.



# ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ మోసం

## నిలదీస్తారనే భయంతో విద్యార్థుల అరెస్ట్

## సిఎం ఓయూ పర్యటనపై హరీశ్ రావు విమర్శలు

**హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** సీఎం రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ పర్యటన నేపథ్యంలో విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు విధిస్తారా? అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని చెప్పారు. ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఇనుప కంచెలు, బ్యారికేడ్లతో ప్రజా తిరుగుబాటును ఆపలేరు. పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఉస్మానియా విద్యార్థి, నిరుద్యోగులు సింహాలై గర్జిస్తారు. ఉద్యోగాల పేరిట మీరు చేసిన మోసాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తరు. మోసం చేసినందుకు ఉస్మానియా సాక్షిగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా రేవంత్ రెడ్డి చేసిందేముందన్నారు. జాబ్‌క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వస్తున్న సందర్భంగా విద్యార్థులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక, పిరికిపంద చర్య అన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక్క విద్యార్థి మీద పోలీసు లాఠీ పడినా తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తున్నాం. ఇందుకేనా విద్యాశాఖను, హోం శాఖను మీ వద్ద పెట్టుకున్నది. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నది. మొత్తం తెలంగాణ సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా... ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అని చెప్పి, ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెచ్చిండు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇవ్వడం. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా నువ్వు చేసింది ఏముంది రేవంత్ రెడ్డి?. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేసారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేసారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేసారు. 22నెలల్లో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నావు. నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నవని మండిపడ్డారు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవు. గ్రంథాలయాల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు.



# మారుతున్న కాలానుగుణంగా బ్యాంకర్లు మారాలి

## రైతులు,ప్రజలకు రుణాల విషయంలో తీరు మార్చుకోవాలి ప్రజలను నియంత్రించేలా బ్యాంక్ పాలసీలు ఉండరాదు

# స్టేట్ లెవల్ బ్యాంకర్స్ మీట్‌లో సిఎం చంద్రబాబు

అమరావతి,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా బ్యాంకుల నిర్ణయాలు ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లు తమ తీరు మార్చుకోవాల్సి ఉందన్నారు. జీఎస్టీలో సంస్కరణల్ని కేంద్రం తీసుకువచ్చిందని. నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు వచ్చేస్తున్నాయని.. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజల్ని నియంత్రించకూడదని తెలిపారు. తదుపరి సంస్కరణల దిశగా ప్రోత్సహించాలన్నారు. ఖరీఫ్‌లో ఇప్పటికే సగం సమయం గడిచిపోయిందని, ఈ పాటికే రైతులకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సిఉందని చెప్పారు. సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వడం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశమైంది. 231 ఎస్ఎల్‌బీసీలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టుపై సీఎం సమీక్ష నిర్వహించారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమానికి బ్యాంకుల సహకారంపై చర్చించారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు అంశం పైనా చర్చించారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లూ తీరు మార్చుకోవాల్సి ఉంది. కేంద్రం.. జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చింది. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజలను నియంత్రించ కూడదన్నారు. తదుపరి సంస్కరణల దిశగా ప్రజలను ప్రోత్సహించాలి. అమెరికా, చైనా లాంటి దేశాలకు సవాల్ విసిరేలా మన ఆర్థిక వ్యవస్థ తయారవుతోంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలి. 2047 నాటికి భారత్ బలమైన ఆర్థికవ్యవస్థగా తయారవుతుంది. ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కాదు. పేదలు- ధనికుల మధ్య అంతరాలు తగ్గేందుకు చర్యలు చేపట్టాలి. ఆర్థికశాస్త్రం చదివిన విద్యార్థిగా, ప్రజాప్రతినిధిగా పేదల కోసమే ఆలోచిస్తా. దేశంలో సంపద సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా బ్యాంకులు, ఆర్థికసంస్థలు పని చేయాలని చంద్రబాబు అన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, ఎస్ హెచ్ జీ రంగాలు, రుణ వితరణ లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలపై అధికారులతో చర్చించారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు అంశంలో బ్యాంకుల సహకారంపై చర్చలు జరిపారు. ఎస్ఎల్ బీసీ సమావేశాలు.. రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలని సూచించారు. రోటీన్ సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, ఇండికేటర్లు కూడా రోటీన్‌గా మారుతున్నాయని చెప్పారు. ఆర్థిక సంస్థలు కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలని అధికారులకు సూచించారు. 2047 నాటికి బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుందన్నారు. ఈ క్రమంలోనే ఫాల్స్ లెండింగ్ చేయాలని ఎవరూ సిఫార్సు చేయరని, ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కావని వ్యాఖ్యానించారు. పేదలు- ధనికుల మధ్య అంతరాలు తగ్గేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికశాస్త్రం చదివిన విద్యార్థిగా, ప్రజాప్రతినిధిగా పేదల గురించి తాను ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఓ దశలో సంపద సృష్టి కోసం, పరిశ్రమల కోసం దావోస్ లాంటి ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగానన్నారు. దేశంలో సంపద సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సమిష్టిగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. సిఎస్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



31 August - 6 September, 2025_Layout 1 8/29/2025 8:38 PM Page 5



# కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల

**ఇచ్చిన హామీలు నిలుపుకోలేక నానా తంటాలు    ఓట్ చోరీ అంటూ ప్రజలను అవమానిస్తున్న కాంగ్రెస్**

**ఓట్ చోరీ జరిగితే బిజెపి 16 సీట్లు గెలిచేది    మాది నిజంగానే దేవుళ్ల పార్టీ**

## పిసిసి చీఫ్ వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్



**కరీంనగర్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ) :** కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే.. రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాగ్దానాలు అమలుకాలేదని, మోసపూరిత హామీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆ పార్టీకి మళ్లీ అధికారం కలేనని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెప్పాలని బండి సవాల్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించిన సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. దొంగ ఓట్లు అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమేనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు వేయడం ఎవరికైనా సాధ్యమా?అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రొహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు బ్యాంకు ముఖ్యమా? అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని బండి సంజయ్ విమర్శించారు. ప్రజలను కలవకుండా రాత్రి పూట యాత్రలు ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. టీపీసీసీ చీఫ్ ఒక గజినీ.. ఆయనను ఎవరైనా గుర్తు పడతారా అని ప్రశ్నించారు. మహేష్ గౌడ్ వార్డు మెంబర్‌గా కూడా గెలిచావా అని బండి సంజయ్ నిలదీశారు. తెలంగాణలో ఓటు చోరీ జరిగితే.. కాంగ్రెస్ ఎనిమిది ఎంపీ సీట్లు కూడా తామే గెలిచే వాళ్లమని చెప్పుకొచ్చారు. ప్రజల ఓట్లతో మహేష్ గౌడ్ ఒక్కసారైనా గెలవాలని ఛాలెంజ్ చేశారు. కర్ణాటక, తెలంగాణలో మీరెలా గెలిచారని ప్రశ్నించారు. టీపీసీసీ చీఫ్ బీఆర్ఎస్ మనిషి అని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆయనకు సెక్యూరిటీ కావాలని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఓటు చోరీ జరిగిందని ప్రజలను మహేష్ గౌడ్ అవమానిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలే ఓట్ల బిచ్చగాళ్లు అని విమర్శించారు. టోపీలు పెట్టుకుని ఓట్ల కోసం వెళ్లేది కాంగ్రెస్ నేతలే అని ఆక్షేపించారు. రోహింగ్యాలు వచ్చింది కాంగ్రెస్ హయాంలోనేనని బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్రం నిధుల కోసమే ఇప్పుడు స్థానిక ఎన్నికలు జరుగుతాయని బండిసంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పంచాయితీలకు ఒక్క పైసా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. 6 గ్యారెంటీలపై ప్రజలు కొట్టేట్లు ఉన్నారని, కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు. కరీంనగర్ లో ఒక్కో మైనార్టీ ఇంట్లో 200 ఓట్లున్నాయని పేర్కొన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ లో అధికారం ఎలా వచ్చిందని బండి ప్రశ్నించారు. ఎన్నికలున్నా.. లేకున్నా హిందూ ధర్మం కోసం నిలబెడతాం అని స్పష్టం చేశారు. భైంసాలో హిందువుల ఇళ్లు తగలబెట్టినప్పుడు వాళ్లెక్కడికి వెళ్లారని నిలదీశారు. తమది దేవుళ్ల పార్టీ అని మీది బిచ్చపు బతుకు అని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మం కోసం బిజెపి నిలబడుతుందని, యుపిఎ హయాంలోనే రోహింగ్యాలు దేశంలోకి వచ్చారని తెలిపారు. కరీంనగర్ లో హిందూ ఓటు ద్వారానే గెలిచానని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# బిజెపి అంటే బాబు, జగన్, పవన్ !

## సిపిఐ కార్యదర్శి రామకృష్ణ ఎద్దేవా

**ఒంగోలు,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** బీజేపీ అంటే బాబు (చంద్రబాబు నాయుడు), జగన్ (వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పవన్ (పవన్ కల్యాణ్) అంటూ సెటైర్లు వేశారు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ.ప్రకాశం జిల్లా పర్యటనలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు విషయంలో ఆ పార్టీలపై మండిపడ్డారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత బీజేపీకి ఒక్కసారి కూడా వ్యతిరేకంగా ఓటు వేయలేదు.. బీజేపీ ప్రవేశపెట్టిన బిల్లులన్నింటికీ వైసీపీ ఓటు వేసిందని దుయ్యబట్టారు.. మరోవైపు చంద్రబాబు బీజేపీకి ఒకసారి దూరమై తిరిగి దగ్గరయ్యాడని.. రాష్ట్రంలో ఉన్న టీడీపీ, జనసేన, వైసీపీ.. బీజేపీకి మద్దతుగా ఉన్నాయని మండిపడ్డారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లో ఇండియా కూటమి అభ్యర్థికి, ఎన్డీఏ అభ్యర్థికి ఓట్లు పడతాయి... కానీ, ఒక్క ఏపీలోనే ఎన్డీఏ అభ్యర్థికి వన్ సైడ్ ఓట్లు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రామకృష్ణ.. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అంటూ కొత్త నిర్వచనం చెప్పి ఆయన.. ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డిని కించపరిచే విధంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేస్తున్నారు.. ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు.. మ-రోవైపు, ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడింది. పంటలు సాగుకి ఎరువులు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్.. కేంద్రం వద్ద ఎరువులు తీసుకురాలేకపోయిందని ఎద్దేవా చేశారు.. యుద్ధ ప్రాతిపదికన రైతులకు ఎరువులు సరఫరా చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు..

# ఎలక్ట్రిక్ వాహనరంగంలోకి మారుతి

**తొలి ఇవి విటారా ఉత్పత్తి ప్రారంభం    వంద దేశాలకు ఎగుమతి లక్ష్యంగా ఉత్పత్తులు**

## గుజరాత్ హన్సల్‌పూర్ ప్లాంట్‌లో ప్రారంభించిన మోడీ




**గాంధీనగర్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** భారత ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలకు అందిస్తున్న ప్రోత్సాహంతో అనేక కంపెనీలు భారత అవసరాలతో పాటు విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఎలక్ట్రిక్ కార్లు, ఈవీ స్కూటర్లను తయారు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మారుతీ సుజుకీ కంపెనీ తయారు చేసిన తొలి మేడిన్ ఇండియా ఎలక్ట్రిక్ కారు విదేశాల్లోనే అమ్మకాలకు సిద్ధం అయ్యింది. దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఈక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌లోని హన్సల్‌పూర్ మారుతీ సుజుకీ మోటార్ ప్లాంట్‌లో రెండు కీలక ప్రాజెక్టులు ప్రారంభించారు. మారుతీ సుజుకీ తొలికారు ఇ-విటారా తో పాటు-హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ ఉత్పత్తి చేసే తొలి ప్లాంట్‌కు జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జపాన్ రాయబారి కీచీ ఒనో పాల్గొన్నారు. భారత్ స్వావలంబన సాధించేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు ఇది ప్రత్యేకమైన రోజు. ఇక్కడ ఉత్పత్తి కానున్న కార్లు 100 దేశాలకు ఎగుమతి కానున్నాయని ఈ కార్యక్రమానికి ముందు మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇ-విటారా తొలికారు యూకేకు ఎగుమతి కానుంది. తొషిబా, డెన్సో, సుజుకీసంస్థల భాగస్వామ్యంతో ఆ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ తయారుకానున్నాయి. దాంతో 80 శాతం బ్యాటరీ దేశీయంగా సిద్ధం కానుంది. ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ తన తొలి విద్యుత్ కారు ఇ-విటారా జనవరిలో ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ కారును 100కు పైగా దేశాలకు ఎగుమతి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా భారత్‌ను గ్లోబల్ ప్రొడక్షన్ హబ్‌గా తీర్చిదిద్దాలనుకుంటున్నట్లు సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ అప్పుడు వెల్లడించారు. మారుతీ సుజుకీ ఇ-విటారా రెండు బ్యాటరీ ఆప్షన్లతో వస్తోంది. 49 కిలోవాట్ అవర్ బ్యాటరీతో వస్తున్న కారు 144 హెచ్‌పీ శక్తిని, 189 కప టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 61ఔత బ్యాటరీ 174 బీహెచ్‌పీని 189 కప టార్క్‌ను విడుదల చేస్తుందని తెలుస్తోంది. అతిపెద్ద బ్యాటరీ వేరియంట్ 500 కిలోమీటర్లకు పైగా రేంజ్ ఇస్తుందని కంపెనీ ప్రదర్శించిన వీడియోలో పేర్కొంది. భారత్‌లో ఇ-విటారా తయారీకి రూ.2,100 కోట్లు-వెచ్చించినట్లు మారుతీ సుజుకీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ హిసాషి టకేయుచి గతంలో తెలిపారు. మారుతీ సుజుకీ ఈవీలు కొనుగోలు చేసేవారికి స్మార్ట్ హోమ్ ఛార్జర్, ఇన్‌స్టలేషన్ సపోర్ట్‌ను అందించనున్నట్లు తెలిపారు. తొలిదశలో 100 ప్రధాన నగరాల్లో ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయాలను అందించనున్నట్లు వివరించారు. ప్రతి 5-10 కిలోమీటర్లకు మారుతీ సుజుకీ ఛార్జింగ్ పాయింట్లను అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు.

# దమ్ముంటే కోదండను సి.ఎం చేయాలి

**కోదండరామ్‌పై మొసలి కన్నీరు    ఉస్మానియాకు వేయికోట్లు ప్రకటించాలి    బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్**



**హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** ఉస్మానియా యూనివర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి సొల్లు పురాణం మాట్లాడారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ విమర్శించారు. సోమవారం బీఆర్ఎస్ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదండరాం పట్ల రేవంత్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారు. రేవంత్ రెడ్డిని హీరోగా పెట్టి ఆహా నా పెళ్లంట సినిమా తీయాలని ఎద్దేవా చేశారు. ఓయూకు వెయ్యి కోట్లు ఇవ్వాలన్నారు. కోదండరామ్ సీఎం పదవికి రేవంత్ రెడ్డి కంటే అర్హుడుఅన్నారు. రేవంత్ రెడ్డి సీఎం పదవి నుంచి దిగిపోయి కోదండరామ్ కు సీఎం పదవి అప్పగించాలని సూచించారు. నేను రాజకీయాల్లోకి రియల్ ఎస్టేట్ దందాల కోసం రాలేదన్నారు. నేను ఏ పార్టీలో ఉన్నా ప్రజల కోసం పనిచేశానని స్పష్టం చేశారు. మా కష్టానికి, త్యాగానికి విలువ లేదా? ఎరుకుల బిడ్డ కుర్రా సత్యనారాయణకు ఎమ్మెల్సీ ఇస్తే అడ్డుకున్నారని అన్నారు. మేము కోదండరామ్ ను అడ్డుకోలేదు. మా గొంతుకోయడం కోసం కోదండరామ్ ను రేవంత్ రెడ్డి అడ్డుపెట్టారన్నారు. కోదండరామ్ తో రేపు పొద్దున మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కోదండరామ్ ను నిలబెట్టాలని సవాల్ విసిరారు. కోదండరామ్ ను లిటిగేషన్ లో ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. సీఎం కుర్చీని గౌరవించాలని అంటున్న రేవంత్ రెడ్డి మంత్రి పదవిని, వైస్ ఛాన్సలర్ పదవిని ఎందుకు గౌరవించడం లేదన్నారు.స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అంటే అందరికి ఆత్మీయత ఎక్కువ. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సావాస దోషాలతో రేవంత్ రెడ్డి లైన్‌లో నడుస్తున్నారన్నారు. అప్పులపై స్పీకర్ అబద్దాలు చెప్పారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన రూ.3 లక్షల 50 వేల 520 కోట్లు అని పార్లమెంటులో కేంద్రమంత్రి అన్నారు. రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దింపి స్పీకర్ ప్రసాద్ కుమార్ సీఎం కావాలన్నారు. పార్లమెంట్‌లో రఘునందన్ రావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి అప్పులపై సమాధానం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ కోసం యాదయ్య, శ్రీకాంతాచారి ఆత్మబలిదానా లు చేసుకుంటే రేవంత్ మాత్రం చంద్రబాబు నాయుడు సంకలో ఉన్నారని ఎద్దేవా చేశారు. నేను కుమార్‌ను ఓయూ వైస్ ఛాన్సలర్ ను చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. దీంతో రేవంత్ రెడ్డి ఫ్యూడలిజం, భూస్వామ్య మనస్తత్వం బయటప డిందన్నారు. ఓయూలో కాళేశ్వరం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు . జీవో 29 పేరు మీద రేవంత్ రెడ్డి విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. కోర్టుల్లో ఉన్న అంశాల గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. కోర్టులను, కోర్టు తీర్పులను రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిని సీఎం చేసేందుకు నిరుద్యోగులు బస్సులు వేసుకుని రాష్ట్రం మొత్తం తిరిగారు. 60వేల ఉద్యోగాలు రేవంత్ రెడ్డి గుర్తించిన ఉద్యోగాలా? సృష్టించిన ఉద్యోగాలా? అని ప్రశ్నించారు. హెచ్‌సీయూలో రేవంత్ రెడ్డి చంపింది ఏనుగులు, సింహాలను కాదు జింకలు, నెమళ్లను చంపారన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డికి భయం మొదలైంది. ఉస్మానియా భూములను బీఆర్ఎస్ ప్లాట్లు చేసుకుని అమ్ముకుంటారని రేవంత్ రెడ్డి అంటున్నారు. గచ్చిబౌలి భూములను ప్లాట్లు చేసి అమ్ముకున్నది ఎవరో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి...లక్షలు పోగొట్టుకుని

## సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు



**హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** సైబర్ నేరాలపై ఎంత అవగాహన కల్పిస్తున్న ఎవరో ఒకరు ఆ ఉచ్చులో చిక్కుకుంటూనే ఉన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్‌కి సంబంధించిన వివరాలను వెల్లడించవద్దని పదే పదే చెబుతున్నా.. ఆ మాట పెడచెవిన పెట్టి సైబర్ నేరగాళ్ల కాటుకు బలి అవుతున్నారు. తాజాగా నగరానికి చెందిన ఓ పురోహితుడికి సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. పాతబస్తీ పురానాపూల్‌కి చెందిన పురోహితుడిని పూజ పేరుతో కేటుగాళ్లు రూ.6 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్ మిలిటరీ కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నామని.. కల్నల్ సర్ ఆరోగ్యం బాగోలేదని చెప్పారు. 11 రోజుల పూజ కోసం 21 మంది పురోహితులు కావాలని నమ్మబలికారు. అడ్వాన్స్ కింద మూడు లక్షలు చెల్లిస్తామని కూడా చెప్పారు. తొలుత రూ.10 పంపి.. ఆ తర్వాత వీడియో కాల్ చేసి మిగితా డబ్బు పంపిస్తామని కార్డు, పిన్ వివరాలు తెలుసుకున్నారు. దాంతో విడతల వారిగా రూ.5.99 లక్షలు నేరగాళ్లుకాజేశారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు 1930కు కాల్ చేసి జరిగింది చెప్పాడు. దీనిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బిడ్డ కోసమే కడియం పార్టీ మారారు

**తన రాజకీయసమాధిని తానే కట్టుకున్నారు    మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య విమర్శలు**



**జనగామ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** ఫిరాయింపుల్లో ముందు వరుసలో ఉన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నానో చెప్పలేని పరిస్థితిలో ఉన్నాడని మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో చేరానని స్వయంగా కడియం శ్రీహరి చెప్పారు. అభివృద్ధి కోసమే పార్టీ మారారని కడియం అంటున్నారు. కడియం శ్రీహరి అప్రూవర్‌గా మారారు. కడియం శ్రీహరికి అభివృద్ధి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. 15 ఏళ్లు మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు అభివృద్ధి గుర్తుకు రాలేదా అని నిలదీశారు. తన బిడ్డను ఎంపీ చేయడం కోసం కడియం శ్రీహరి పార్టీ మారారు. తన రాజకీయ సమాధిని తానే కట్టుకున్నారన్నారు. ఆయన విదేశాల్లో ఆస్తులు సంపాదించుకున్నారు, హైడల్ ప్రాజెక్టులు అమ్ముకున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రిగా పోస్టులు అమ్ముకున్నారు. కడియం శ్రీహరి అభివృద్ధి కావడం తప్పా స్టేషన్ ఘన్ పూర్‌ను అభివృద్ధి చేయలేదని విమర్శించారు. జస్టిస్ బి.ఆర్.గవాయ్ మూడు నెలల గడువు ఇచ్చి స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని డైరెక్షన్ ఇచ్చారు. స్పీకర్ రాజ్యాంగాన్ని పరిరక్షించాలి. అంబేద్కర్ పైన గౌరవం ఉంటే స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి చెప్పినట్లు వింటే స్పీకర్ కోర్టు ధిక్కరణ కిందకు వస్తారు. కడియం శ్రీహరి అంటే అవినీతి తిమింగలం అని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల నుంచి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడ్డారు. బినామీ పేర్లతో కడియం శ్రీహరికి ఆస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. టిక్కెట్ ఇవ్వకపోతే పార్టీ మారతనని కడియం శ్రీహరి కేసీఆర్ ను బ్లాక్ మెయిల్ చేశారని విమర్శించారు. కడియం శ్రీహరికి ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు.

# ఏసిబికి చిక్కిన వ్యవసాయాధికారి

## లంచం తీసుకుంటుండగా పట్టివేత

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు 25(ఆర్ఎన్ఎ):**ఏసీబీ ఎన్ని దాడులు చేస్తున్నా ఎంత మందిని అరెస్టు చేస్తున్నా అధికారుల చేతివాటం మారటం లేదు. ఏసీబీకి దొరికితే ఉద్యోగం రిస్క్‌లో పడుతుందని కూడా ఆలోచించకుండా టేబుల్ కింద చేయి పెడుతూనే ఉన్నారు. సోమవారం కొత్తగూడెం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింహారావు లంచం తీసుకుంటూ ఏసీబీకి అడ్డంగా దొరికారు. లక్ష్మీదేవి పల్లి మండలం బంగారు చిలక గ్రామంలోని ఫర్టిలైజర్ షాప్ యజమాని నుంచి రూ. 50 వేల లంచం డిమాండ్ చేయగా... ఇవాళ రూ.25 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. యూరియా అమ్మకాల కోసం షో కాజ్ నోటీసు ఇచ్చి దాన్ని ఉపసంహరించుకునేందుకు రూ 25 వేలు తన కార్యాలయం విద్యానగర్ లో లంచం తీసుకుంటుండగా ఏసీబీడి ఎస్పీ వై. రమేష్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఏసీబీ డీఎస్పీ వై రమేష్ .. కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఏడిఏ ఆఫీస్ లో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఏడీఏ నరసింహారావు ఫెర్టిలైజర్ షాపు యజమాని వద్ద 25 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి సిబ్బంది రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. లక్షిమీదేవిపల్లి మండలంలోని బంగారు చెలక గ్రామంలో యూరియా అమ్మకాలు చేస్తున్న ఫెర్టిలైజర్ షాప్ దగ్గరకు ఏడిఏ నరసింహారావు వెళ్లారు. షాపు వారిని సంబంధిత కాగితాలు తీసుకొని ఏడీఏ ఆఫీస్ కు రావలసిందిగా ఆదేశించారు. షాపు ఓనరు కాగితాలు తీసుకొని అగ్రికల్చర్ ఆఫీస్ కు రాగా మీ దగ్గర ఫార్మ్ లేదని, ఇన్ వాయిస్ ప్రాపర్ గా లేదని రూ. 50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇచ్చుకోలేమని బతిమిలాడినప్పటికీ ఇవ్వక పోతే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని బెదిరించడంతో షాపు ఓనర్ ఏసీబీని ఆశ్రయించాడు. షాపు ఓనర్ ని లంచం అడిగిన వాయిస్ రికార్డుతో పాటు ఈ రోజు రూ. 25000 లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కలర్ టెస్టింగ్ లో సైతం ఏడిఏ నరసింహారావు దొరికినట్లు ఏసీబీ డీఎస్పీ వై రమేష్ తెలిపారు.

# ఉన్నత లక్ష్యం కోసం ఏకాగ్రతతో సాధన చేయాలి

## సోషల్ మీడియా పరిమితంగా చూడాలి కష్టపడే తత్వం అలవర్చుకోవాలి ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, ఆగస్టు28(జనవిజయం):** ఎక్కడ ఉన్న, ఏం చదివిన కష్టపడే తత్వం ఉన్నప్పుడే అనుకున్నది సాధిస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా పీఎం కేర్స్ పథకం క్రింద పిల్లలకు ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, పిల్లలకు మార్గదర్శనం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు పీఎం కేర్స్ క్రింద 10 లక్షల రూపాయల పోస్టల్ డిపాజిట్, వారి చదువు, కెరీర్ పరంగా స్థిర పడే విధంగా ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో కోవిడ్ బారిన పడి తల్లిదండ్రులను కోల్పోయిన 13 మంది పిల్లలను గుర్తించినట్లు, వారి పేర 10 లక్షల పోస్టల్ డిపాజిట్ చేసినట్లు, ఇట్టి మొత్తం వారికి 23 సంవత్సరాల వయస్సు నిండగానే డ్రా చేసుకొనుటకు అవకాశం కల్పించినట్లు అన్నారు. ఇట్టి డబ్బును వృథా చేయక ఉపాధికల్పనకు, అభివృద్ధి కి సద్వినియోగం చేసుకోవాలన్నారు. విభిన్న కుటుంబ నేపథ్యం, వివిధ స్థాయిలో ఉన్న, ఎక్కడ ఉన్న, ఏం చదివిన కష్టపడే తత్వం ఉన్నప్పుడే మంచి ఫలితం ఉంటుందని అన్నారు. కష్టం ఎప్పుడు వృధా కాదని, సులభంగా వచ్చింది ఏదైనా ఎక్కువ రోజులు నిలవదని అన్నారు. కాలం ఎంతో విలువైనదని, పోయిన కాలం ఎన్నటికీ తిరిగి రాదని అన్నారు. జీవితంలో ఇది సాధించాలన్న కష్టపడాలని అనుకున్న లక్ష్యసాధనపై దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. జీవితంలో అప్ అండ్ డౌన్స్ సహజమని, ఒకే రోజు అన్ని మన దగ్గరకు రావని అన్నారు. తాను 3 సార్లు సివిల్స్ పరీక్షలు రాసిన ఫలితం రాలేదని, నిరుత్సాహం చెందక, ఎక్కడ పొరపాట్లు చేసాను అని దీక్షతో పొరపాట్లు సరిదిద్దుకొని ఐఏఎస్ అయ్యానని కలెక్టర్ అన్నారు. అకుంఠిత దీక్షతో కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించానని అన్నారు. పరాజయం నుండి, నిరంతర ప్రయత్నం తో విజయం వైపు సాగాలన్నారు. సోషల్ మీడియా నియంత్రణ తో ఉపయోగించాలని, సోషల్ మీడియా తో సమయాన్ని వృధా చేసుకోవద్దని అన్నారు. సోషల్ మీడియా బదులు ఆటలు ఆడితే శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. ఇంటర్ నెట్ ను మంచి విషయాలు నేర్చుకోవడానికి వాడాలన్నారు.చదువును మించింది లేదని,



కష్టపడి చదివితే ఉన్నత స్థానం చేరుకోవచ్చని కలెక్టర్ అన్నారు. కాలం చాలా విలువైనదని, పోతే తిరిగి రాదని, ఇప్పుడు కాలాన్ని వృధా చేసి, తర్వాత బాధపడితే ఎటువంటి ప్రయోజనం ఉండదని అన్నారు. కాలం రీత్యా పిల్లలు ఎంతో ధనవంతులని, సోమరితనం వీడి, క్రమశిక్షణ తో కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డబ్బు నిర్వహణ, ఎక్కడ ఎలా పెట్టుబడి పెట్టాలనే అవగాహన కల్గివుండాలని, డబ్బు ను పొదుపుగా ఖర్చుపెడుతూ అభివృద్ధి చెందాలన్నారు. మంచిగా స్థిరపడి, ఉన్నత స్థానానికి చేరుకోవడమే, తల్లిదండ్రులకు మనం ఇచ్చే బహుమతి అని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు భద్రపర్చుకొనే ఫోల్డర్, ఆర్థిక అక్షరాస్యత పై అవగాహనకు సంబంధించి పుస్తకం, పోస్టల్ డిపాజిట్ పుస్తకం లు పిల్లలకు, కలెక్టర్ అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ కమిటీ చైర్ పర్సన్ భారతి రాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి విష్ణు వందన, సంక్షేమ శాఖ అధికారులు, పిల్లలు, పిల్లల సంరక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ




**ఖమ్మం, ఆగస్టు28(జనవిజయం):** స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం విద్యా శాఖపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, అపార్ రిజిస్ట్రేషన్, ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తదితర అంశాలపై అదనపు కలెక్టర్, మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఏక రూప దుస్తులు మొదటి జత రాని కొత్త విద్యార్థుల జాబితా, రెండవ జత రాని విద్యార్థుల వివరాలు అందించాలని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏక రూప దుస్తులు రెండు జతలు పంపిణీ చేసినప్పటికి ఆన్ లైన్ నమోదులో సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, వీటిని గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్ పంపిణీ పూర్తి చేయాలని, ఈ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.ఉన్న పాఠ్య పుస్తకాల స్టాక్ అంతర్గతంగా అడ్జెస్ట్ మెంట్ చేసుకోవాలని, కొత్తగా చేరిన విద్యార్థులకు కూడా పాఠ్య పుస్తకాలు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

**రాబోయే సమీక్ష నాటికి ఎం.ఐ.ఎస్.** కో-ఆర్డినేటర్, సి.ఆర్.పి.లు, మండల విద్యా శాఖ అధికారి సమన్వయం చేసుకుంటూ సాంకేతిక అంశాలు పరిష్కరించి పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తుల పంపిణీ వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరు జవాబుదారీతనంతో పని చేయాలని, విద్యార్థుల వారీగా వివరాలు జిల్లా లాగిన్ లో నమోదు అయ్యేలా సీఎంఓ పర్యవేక్షించాలని అన్నారు. మండల విద్యా శాఖ అధికారులు పూర్తి బాధ్యత తీసుకొని వివరాలు అప్ డేట్ చేయాలని అన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల పెండింగ్ ఎఫ్.ఆర్.ఎస్. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు విద్యార్థులు గైర్హాజరైతే రెగ్యులర్ ఫాలో అప్ ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అపార్ నెంబర్ జనరేట్ చేయాలని అన్నారు. విద్యాశాఖ పరిధిలో పదోన్నతులు లభించిన ఉపాధ్యాయులు, సిబ్బంది రిలీవ్, నూతన వర్క్ ప్లేస్ జాయినింగ్ పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో అవసరానికి మించి టీచర్లు ఉన్న పాఠశాల జాబితా, టీచర్ల జాబితా తయారు చేయాలని అన్నారు. జిల్లాలో పదోన్నతులు కారణంగా ఏర్పడిన ఖాళీలలో, అవసరమున్న పాఠశాలల్లో ఈ టీచర్లను అడ్జస్ట్ చేస్తూ సెప్టెంబర్ లో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ సన్యాసయ్య, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, మండల విద్యా శాఖ అధికారులు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, ఏపిఎంలు, సిఆర్పిలు, ఏఎస్ఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి సంస్థాగత కార్యదర్శికి ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన

## నన్ను ఫుట్ బాల్ ఆడుకుంటున్నారన్న ఎంపి కొండా

**హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్.ఎన్.ఎ):** తెలంగాణలో భాజపా వ్యవహారంపై ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. తనను ఫుట్‌బాల్‌లా ఆడుకుంటున్నారని నిరసన తెలిపారు. ఇందుకు అనుగుణంగా భాజపా రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి కానుకగా ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్



జిల్లాల్లో పార్టీ వ్యవహారంపై విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తనను ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తివారీని కలిస్తే.. రామచందర్ రావును కలవమంటున్నారు. రామచందర్‌రావును కలిస్తే.. అభయ్ పాటిల్‌ను కలవమంటున్నారు. ఒకరిని కలిస్తే మరొకరి పేరు చెబుతున్నారని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుల తీరు, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయ లోపంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

# రాహుల్ ను ఆటలో అరటిపండుని చేస్తున్నారు

## మోడీ,రేవంత్ కలిసిపోయారు తెలంగాణ భవన్‌లో కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** దేశంలో ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రధాని మోదీ, తెలంగాణలో రెండు లక్షల ఉద్యోగాలని సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ధ్వజమెత్తారు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ.. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని రేవంత్ చెప్పి మాట తప్పారని విమర్శించారు. ఇద్దరూ కలిసి ఒక్క హామీని కూడా ఎందుకు అమలు చేయలేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ భవన్‌లో ఆర్మూర్ నేతలను ఉద్దేశించి కెటిఆర్ మాట్లాడారు.బడే భాయ్, చోటే భాయ్ ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారని , ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి కలిసి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆటలో అరటిపండుగా మార్చారని ఎద్దేవా చేశారు. పెద్ద మోదీ, చిన్న మోదీ ఒకే రకంగా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇద్దరూ కలిసి రాహుల్‌కు పెద్ద షాక్ ఇవ్వటం ఖాయమని జోస్యం చెప్పారు. ఉస్మానియాలో రేవంత్ రెడ్డి, కేసీఆర్ ప్రభుత్వం పునాది వేసిన భవనాలను ప్రారంభించారు. రేవంత్ రెడ్డి వికృత మాటలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. గత ముఖ్యమంత్రులతో పోల్చి చూస్తూ ప్రజలు రేవంత్ రెడ్డిని బండ బూతులు తిడుతున్నారు. రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారు. మా ప్రభుత్వం నిర్మించిన భవనాలకు రిబ్బన్ కట్ చేయడానికి తాపత్రయ పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ. రెండూ దొందూ దొందే. పెట్టుబడులు, పరిశ్రమలు, విభజన హామీలు అన్నింటిలోనూ బీజేపీ తెలంగాణకు మోసం చేసింది' అని



ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోంది. 20 నెలల కాంగ్రెస్ పాలన నచ్చకుంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు ఈ ప్రభుత్వం చేయించడం లేదు. మోదీ, చంద్రబాబు ఆదేశాల మేరకు గోదావరి నీళ్లను దిగువకు పంపించేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారు. గోదావరి నీళ్లు బకనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు వెళ్లాలని బీజేపీ ప్రభుత్వం రేవంత్‌కు ఆదేశాలిచ్చింది. అందుకే రేవంత్ కాళేశ్వరం ప్రాజెక్టుపై పగ పట్టారు. మోదీకి, రేవంత్‌కి అనేక పోలికలు ఉన్నాయి. కాంగ్రెస్ పాలన వల్లే తెలంగాణలో యూరియా సంక్షోభం వచ్చింది. ఒకవైపు యూరియా సంక్షోభం ఉంటే, రేవంత్ రెడ్డి సినిమా వాళ్లతో మీటింగ్ పెట్టుకున్నారు. రేవంత్‌పై మాట పడకుండా బీజేపీ కాపాడుతోందని మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికలపై బిఆర్ఎస్ అనాసక్తి

## ఎన్నికకు దూరంగా ఉండాలనే యోచనలో పార్టీ?

**హైదరాబాద్,ఆగస్ట్29(ఆర్ఎన్ఎ):** ఉప రాష్ట్రపతి ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా విపక్ష బిఆర్ఎస్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాంగ్రెస్, ఎన్‌డిఎ కూటమిలకు తాము దూరమని కెటిఆర్ ప్రకటించారు. ఈ రెండింటి వల్ల ఒరిగిందేమీ లేదని అంటోంది. దీనిని బట్టి చూస్తుంటే ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఎన్నికల్లో పాల్గొనడం వల్ల వచ్చే ఉపయోగం ఏమీ లేదని కెటిఆర్ గట్టిగానే వాదిస్తున్నారు. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నకిలో ఎన్‌డిఎ అభ్యర్థికి గానీ, విపక్షాల అభ్యర్థికి గానీ ఓటు వేయకుండా తటస్థంగా ఉండాలని పా ర్టి అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్రా నికి సెప్టెంబర్ 9లోపు ఎవరు 2 లక్షల టన్నుల ఎరువులు తీసుకువస్తా రో ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి బిఆర్ ఎస్ మద్దతు ఇస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తేల్చి చెప్పారు. అయితే ఇప్పటివరకు కెటిఆర్ డిమాండ్ పై కాంగ్రెస్ పార్టీ కానీ, బిజెపి పార్టీ స్పందించలేదు. నిజానికి యూరియా సమస్య కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉంటుంది. దీనికి కాంగ్రెస్‌తో పెద్దగా సంబంధం లేదు. అందువల్ల అధికార పార్టీ యూరియా సరఫరా చేస్తే బిజెపికి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ రాజీనామాతో ఇప్పుడు ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు జరగబోతున్నాయి. ఓటింగ్ విషయంలో బిఆర్ఎస్ వ్యూహం ఏంటనే విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికలో పార్లమెంట్ ఉభయ సభల సభ్యులే ఓటర్లు. బిఆర్ఎస్‌కు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేదు. ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీకి రాజ్యసభలో వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావు, పార్థసారథి రెడ్డి, కె.ఆర్ సురేష్ రెడ్డిలు ఎంపీలుగా కొనసాగుతున్నారు. వీళ్లు ఎవరికి ఓటేస్తారనేది ఆసక్తికరంగా మారింది. 2022లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికలలో ఎన్‌డిఎ కూటమి తరఫున ద్రౌపది ముర్ము, ఇండియా కూటమి తరఫున మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హా పోటీ- చే యగా, అప్పుడు తెలంగాణ సిఎంగా ఉన్న కెసిఆర్ ఇండియా కూటమి అభ్యర్థి యశ్వంత్ సి న్హాకు మద్దతు ప్రకటించారు ప్రస్తుతం ఉప రాష్ట్రపతి ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో బిఆర్ఎస్ ఎలాంటి వైఖరిని తీసుకోబో తున్నారన్నది చర్చనీయాంశంగా మారిం ది. బిజెపిలో బిఆర్ఎస్ పార్టీని విలీనం చే సేందుకు ప్రయత్నాలు జరిగాయనే ప్రచా రం ఇటీ-వల విస్తృతంగా జరిగింది. ఇలాం టి సమయంలో ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు ఇస్తే బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే అనే అంటూ మ-రోసారి విలీన ప్రచారం తెర మీదికి వ చ్చే అవకాశం ఉంటుందని, ఒకవేళ విపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇస్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని సపోర్ట్ చేశారన్న ప్రచారం జరుగుతుందని పార్టీ అధి ష్టానం భావిస్తున్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రాధాన్యతల కారణంగా ఎవరికి మద్దతు ఇచ్చినా సమస్య తలెత్తిందని, కాబట్టి ఉపరాష్ట్ర ఎన్నికలో తటస్థంగా ఉండడమే ఉత్తమం అని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కెటిఆర్ కూఆ తన సన్నిహితలు వద్ద ఇలాంటి వ్యాఖ్యలే చేశారని అంటున్నారు. అంతెందుకు బహిరంగంగా కూడా ఆయన ఇవే వ్యాఖ్యలు చేశారు. కాబట్టి ఉపరాష్ట్రపతి ఎన్నికకుదూరంగా ఉండడమే మంచిదనే అభిప్రాయంలో పార్టీ ఉంది.

# గిడుగు రామ్మూర్తి జయంతి

## 29న తెలుగు భాషా దినోత్సవం



**విజయనగరం,ఆగస్ట్29(ఆర్ఎన్ఎ):**తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడైన గిడుగు వెంకట రామమూర్తి తెలుగు కోసం ఎంతగానో కృషి చేశారు. ఆయన ఉద్యమ ఫలితంగా వాడుక భాషకు మర్యాద దక్కింది. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, తెలుగులో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడైనారు. గిడుగు రామ్మూర్తి జనవరి 22, 1940న మరణించారు. గిడుగు రామ్మూర్తి జయంతి ఆగస్టు 29 ని 'తెలుగు భాషా దినోత్సవం' గా జరుపుకుంటున్నాము. ఆగష్టు 29, 1863న శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేట గ్రామంలో జన్మించారు. తండ్రి వీర్రాజు పర్వతాలపేట ఠాణాలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తుండేవారు. చిన్న వయస్సులోనే రామమూర్తి తండ్రిని కోల్పోయారు. విజయనగరంలో మేనమామగారి ఇంట్లో ఉంటూ రామమూర్తి చదువు కొనసాగించారు. 1879లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు.ఆ రోజుల్లో గురజాడ అప్పారావుకు సహాధ్యాయి... ఆరోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగింది. తెలుగు, సవరభాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నారు. సవరభాషలో పుస్తకాలు రాసి సొంతడబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో 'రావ్ బహదూర్' బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్ఫై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవరభాషా వ్యాకరణాన్ని, 1936లో సవర-ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931లోను, సవర-ఇంగ్లీషు కోశాన్ని 1938లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్-ఇ-హింద్ ' అనే స్వర్ణ పతకాన్నిచ్చి గౌరవించింది.

31 August - 6 September, 2025_Layout 1 8/29/2025 8:38 PM Page 7

31 ఆగష్టు - 06 సెప్టెంబరు, 2025 | జన విజయం | సంపుటి : 8 | సంచిక : 48 | ఖమ్మం | 7
31 August - 06 September, 2025 | JANA VIJAYAM | Volume : 8 | Issue : 48 | KHAMMAM

# ఫుడ్ ప్యాకెట్లపై ఎక్స్‌పైరీ డేట్ మార్చి అమ్మకాలు

## తెలుగువారు సహా 12 మందికి రెండేళ్ల జైలు

## శిక్షపడ్డవారిలో నిజామబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు

**నిజామాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** బహ్రెయిన్‌లో కాలం చెల్లిన ఫుడ్ ప్యాకెట్లపై గడువు తేదీలను మార్చిన నేరంపై తెలుగువారితో సహా 12 మంది ప్రవాసీయులకు రెండేళ్ల జైలు శిక్ష పడింది. అలాగే దేశ బహిష్కరణ శిక్ష కూడా విధించారు. ఆహార భద్రతా ప్రమాణాలను గల్ఫ్ దేశాలన్ని ఖచ్చితంగా పాటిస్తూ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తాయి. అయినా కొందరు వ్యాపారస్థులు అక్రమాలకు పాల్పడుతుంటారు. అక్రమాలు వెలుగులోకి వచ్చినపుడు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. అరబ్బు దేశానికి పని చేయడానికి వచ్చిన ఓ పంజాబ్ యువకుడు తను పని చేస్తున్న సంస్థలోని లొసుగులపై ఫిర్యాదు చేశాడు. బహ్రెయిన్ లోని ఒక ప్రముఖ ఆహార సామాగ్రి సరఫరా సంస్థలో పని చేస్తున్న తెలుగు వారితో సహా మొత్తం 19 మంది భారతీయులు ఫుడ్ ప్యాకెట్లపై గడువు తేదీలను మార్చిన నేరంపై రెండేళ్ల జైలు శిక్షను అనుభవించనున్నారు. వీరిలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు, రాజన్న సిరిసిల్లా, జగిత్యాల జిల్లాలకు చెందిన ఒక్కొకరు చొప్పున మొత్తం అయిదుగురు తెలంగాణ ప్రవాసీయులకు బహ్రెయిన్ హైకోర్టు రెండేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. ఒక యువకుడు కొద్ది కాలం క్రితం బహ్రెయిన్ లోని సదరు ఆహార సంస్థలో కార్మికుడిగా పని చేయడానికి వచ్చాడు. అయితే తాను ఆశించిన పని లభించకపోవడంతో ఆగ్రహం పెంచుకున్నాడు. ఆహార గిడ్డంగిలో ఆహార ప్యాకెట్లపై గడువు ముగింపు తేదీలను మారుస్తూ మోసాలకు పాల్పడుతున్నారని వీడియో రికార్డింగ్ చేసి నేరుగా బహ్రెయిన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు, వాణిజ్య, ఆరోగ్య శాఖ అధికారులు గిడ్డంగులపై దాడులు చేసి గడువు ముగిసిన 14 వేల వివిధ ఆహార ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 29 మందిని అరెస్ట్ చేసారు. విచారణ అనంతరం, ఏడుగురు భారతీయులను విడుదల చేశారు. స్థానికులయిన యాజమానులతో పాటు- మొత్తం 19 మంది భారతీయులకు జైలు శిక్షలు విధించారు. హై కోర్టుకు అప్పీలుకు వెళ్లినా ఫలితం లేకపోయింది. కాగా, తమ వలన కష్టాలు ఎదుర్కొంటు-న్న భారతీయ కార్మికులకు వీలయినంతగా సహాయం చేసేందుకు సదరు సంస్థ సిద్ధమైంది. స్వదేశంలోని వీరి కుటుంబాలకు కూడా ప్రతి నెలా ఆర్థిక సహాయం చేయడానికి కూడా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రెండేళ్ల జైలు శిక్ష అనంతరం ఈ కార్మికులను దేశం నుంచి బహిష్కరించాలని న్యాయస్థానం తీర్పునిచ్చింది.

# ఓటర్ల జాబితా విడుదలకు ఇసి నోటిఫికేషన్

**స్థానిక ఎన్నికలపై కసరత్తు** **28లోపు ముసాయిదా జాబితా ప్రకటన**

**హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లోని ఫోటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది. ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఇక ఆ మరునాడే అంటే ఆగస్టు 29వ తేదీన ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫోటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణకు ఆదేశించింది. తెలంగాణ కేబినెట్ సమావేశం ఆగస్టు 29న మద్యాహ్నం 3:30గంటలకు జరగనుంది. సెక్రటేరియట్ లో సీఎం రేవంత్ అధ్యక్షతన ఈ భేటీ జరగనుంది. బీసీ రిజర్వేషన్లు, అసెంబ్లీ సమావేశాల తేదీ ఖరారు, సర్పంచ్ ఎన్నికలు,కాళేశ్వరం నివేదికపై ప్రధానంగా ఈ భేటీలో చర్చించనున్నారు. ముఖ్యంగా అందరు ఎదురు చూస్తోన్న పంచాయతీ ఎన్నికల నిర్వాహణపై ఈ కేబినెట్ భేటీలో క్లారిటీ రానుంది. సెప్టెంబర్ 30 లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికలపై స్పష్టత కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతంరిజర్వేషన్లు కల్పించే బిల్లు, పంచాయతీ రాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండటంతో రిజర్వేషన్లపై ఇప్పటికే న్యాయ నిపుణుల సలహా తీసుకుంది సబ్ కమిటీ. ఆగస్టు 28 లోపు ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనుంది . సబ్ కమిటీ ఇచ్చే నివేదికపై కేబినెట్ లో చర్చించి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనుంది.

# తిరుమల పవిత్రతలో రాజీలేదు

## భూమన తీరుపై మండిపడ్డ టిటిడి ఛైర్మన్



**తిరుపతి,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదన్నారు. ముంతాజ్ హోటల్ వ్యవహారంపై పద్మావతి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్లాది రూపాయల తితిదే నిధులు వైకాపా నేతలు మింగేశారని ధ్వజమెత్తారు. ఏడు కొండలను ఆనుకొని ఉన్న ప్రాంతాన్ని ముంతాజ్ హోటల్‌కు కేటాయించడం వైకాపా చేసిన తప్పు. పవిత్ర తిరుమలలో ముంతాజ్ హోటల్ నిర్మాణం సరికాదని చంద్రబాబు చెప్పారు. యాజమాన్యాన్ని ఒప్పించి మరోచోట 25 ఎకరాలు తీసుకునేందుకు చంద్రబాబు ఒప్పించారు. తితిదే భూములను ప్రైవేటు సంస్థలకు ఇస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ అంశంలో సీబీఐ విచారణ జరిపించాలని వైకాపా నేతలు అడగటం హాస్యాస్పదం. వైకాపా నేతలు డబ్బు వెదజల్లి అందరినీ కొనేందుకు అలవాటుపడ్డారు. మేం బోర్డులోకి వచ్చాక అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేస్తున్నాం. ముంతాజ్ హోటల్‌కు భూములు ఇచ్చేందుకు అజయ్ అనే వ్యక్తిని బెదిరించారు. సాక్షాత్తూ జగనే.. అజయ్‌కు పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకి పెట్టి బెదిరించారు. తిరుపతిలో నివసించేందుకు భూమన కరుణాకర్‌రెడ్డి అనర్హుడు. అతన్ని తిరుపతి నుంచి తరిమికొట్టాలని బీఆర్ నాయుడు అన్నారు. తిరుమలపై భూమలన అదేపనిగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# చంద్రగ్రహణం కారణంగా 7న శ్రీవారి ఆలయం మూసివేత

**తిరుమల,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ):** చంద్ర గ్రహణం కారణంగా సెప్టెంబరు 7న దాదాపు 12 గంటల పాటు శ్రీవారి ఆలయం మూసివేయనున్నట్టు తితిదే ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబరు7న రాత్రి 9.50 గంటలకు చందగ్రహణం ప్రారంభమై.. అర్ధరాత్రి 1.31 గంటలకు ముగుస్తుంది. సాధారణంగా గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సెప్టెంబరు 8న ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యహవచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు. 8వ తేదీ ఉదయం 6 గంటల నుంచి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. చందగ్రహణం కారణంగా వచ్చే నెల 7ఆదివారం ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది. అదే రోజు సాయంత్రం 3 గంటల నుంచి తిరుమలలో అన్నప్రసాద వితరణ ఉండదు. సెప్టెంబరు 8న ఉదయం 8.30 గంటలకు అన్నప్రసాదాల పంపిణీ పునః ప్రారంభించనున్నట్టు తితిదే తెలిపింది. భక్తుల సౌకర్యార్థం ముందస్తుగా తితిదే అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో 30వేల పులిహోర ప్యాకెట్లను సెప్టెంబరు 7న సాయంత్రం నుంచి పంపిణీ చేయన్నట్టు- అధికారులు తెలిపారు. శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న వైభోత్సవ మండపం, రామ్ భగీచా, పీఏసీ-1, సీఆర్వో, ఏఎన్సీ ప్రాంతాల్లోని ఫుడ్ కౌంటర్లు, శ్రీవారి సేవా సదన్ వద్ద భక్తులకు అన్నప్రసాదం ప్యాకెట్ల అందించనున్నట్టు పేర్కొన్నారు.

# యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

## కేంద్ర అసమర్థత కారణంగానే ఇబ్బందులు

## రైతులకు బహిరంగ లేఖరాసిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** తెలంగాణ రైతాంగానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థత కారణంగానే రాష్ట్రంలో యురియా కొరత ఏర్పడిందంటూ లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్టాన్రికి రావాల్సిన యూరియా సరఫరాలో కేంద్రం ఘోరంగా విఫలమైందని లేఖలో ఆరోపించారాయన. కేంద్ర ప్రభుత్వ అసమర్థతతో దిగుమతి యూరియా రాలేదు. రాష్టాన్రికి రావాల్సిన యూరియా సరఫరాలో ఘోర వైఫల్యం చెందింది. రైతులకు ఇప్పటివరకు 7.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశాం. ఆగస్టు వరకు రాష్టాన్రికి 3.94 లక్షల మెట్రిక్ టన్నుల దిగుమతి యూరియా కేటాయించారు. అందులో కేవలం 2.10 లక్షల మెట్రిక్ టన్నులే సరఫరా చేయడం జరిగింది. ఎఈర లో 78 రోజులు ఉత్పత్తి నిలిచిపోవడంతో యూరియా రాలేదు. రాష్టాన్రికి 1.69 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపులో 1.07 లక్షలే సరఫరా చేశారు. మొత్తం 2.58 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు- ఏర్పడింది. కేంద్ర వైఫల్యాన్ని రాష్ట్రంపై నెట్టాలని చూస్తున్నారు. దేశవ్యాప్తంగా యూరియా కొరత ఉంది. కానీ, తెలంగాణలో మాత్రమే యూరియా కొరత ఉన్నట్లు- బీజేపీ నేతలు అబద్ధాలు చెబుతున్నారు.' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన లేఖలో ఆరోపించారు. రైతుల ముసుగులో బీఆర్ఎస్ ప్రేరేపిత ఆందోళనలు చేస్తున్నారు. యూరియా క్యూలైన్లపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరుగుతోంది. నానో యూరియా వినియోగం పెంచితే రైతులకు మేలు జరుగుతుంది. కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలని కేంద్రానికి డిమాండ్ చేస్తున్నాం. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు భరోసా కల్పిస్తాం. రాష్టాన్రికి రావాల్సిన యూరియా తెప్పించేందుకు ఎంతవరకైనా పోరాడతాం.' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన లేఖలో పేర్కొన్నారు.

# అనుమతి లేని కేబుళ్లను తొలగించవచ్చు

## మరోమారు స్పష్టం చేసిన హైకోర్టు

**హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్లు తొలగించవచ్చని హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది. కేబుల్ వైర్ల తొలగింపుపై ఎయిర్టెల్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. రామంతాపూర్ ఘటన తరువాత విద్యుత్ స్తంభాలపై కేబుళ్ల వల్లనే ప్రమదం చోటు చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ క్రమంలో జిహెచ్‌ఎంసి వ్యాప్తంగా విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్లను సిబ్బంది తొలగిస్తున్నారు. దీంతో హైకోర్టులో ఎయిర్‌టెల్ సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. అనుమతి తీసుకున్న కేబుళ్లను సైతం తొలగిస్తున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. దీంతో ఏయే స్తంభాలకు అనుమతి తీసుకున్నారో చూపించాలని టిజిఎస్పిడిసిఎల్ తరపు న్యాయవారి కోరారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం అనుమతిలేని కేబుళ్లను తొలగించొచ్చని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# పర్యాటకంగా కోనసీమ అభివృద్ధికి కృషి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**అమలాపురం,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** పర్యాటకంగా కోనసీమ మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరముందని బిజెప రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఇక్కడ వనరులు ఉన్నాయని, గత ఐదేళ్లలో అభివృద్దిపై దృష్టి పెట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇపుడు అభివృద్ధి విషయంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. అమలాపురంలో చాయ్ పే చర్చ, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడారు. కేరళ తరహాలో కోనసీమ ప్రాంతంలో అభివృద్ధి జరిగేలా ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తుంది. కోనసీమకు రైల్వే లైన్ లేకపోవడం దురదృష్టకరం. లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగి ఉన్న సమయంలో రైల్వే లైన్‌కు సర్వే జరిగింది. కొంకణ్ రైల్వే తరహాలో ఇక్కడ అభివృద్ధి చేస్తే బాగుంటుంది. టెంపుల్ టూరిజం అభివృద్ధి చేసే అంశంపై దేవాదాయశాఖ దృష్టిపెట్టాల్సిన అవసరముంది. మనం ఆత్మనిర్భర్ భారత్ దిశగా అడుగులు వేయాలి. స్వదేశీ వస్తువుల కొనుగోలు పెరగాలి. ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకుంటుంది. సీఎం చంద్రబాబు ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నారని పీవీఎన్ మాధవ్ అన్నారు.

# మోడీ డిగ్రీ వివాదంపై హైకోర్టు విచారణ

## వివరాలు తెలపాల్సిన అసవరం లేదని వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** ప్రధాని నరేంద్ర మోదీ డిగ్రీ వివరాలను వెల్లడించాలంటూ దిల్లీ విశ్వవిద్యాలయానికి కేంద్ర సమాచార కమిషన్ గతంలో జారీ చేసిన ఆదేశాలను దిల్లీ హైకోర్టు పక్కనపెట్టింది. ఈ మేరకు ఫిబ్రవరి 27న రిజర్వ్ చేసిన తీర్పును జస్టిస్ సచిన్ దత్తా సోమవారం వెలువరించారు. నీరజ్ అనే వ్యక్తి ప్రధాని మోదీ డిగ్రీ వివరాల కోసం సమాచార హక్కు చట్టం కింద సీఐసీకి దరఖాస్తు పెట్టారు. ప్రధాని 1978లో బీఏ పూర్తి చేశారు. దీంతో ఆ ఏడాది బీఏ పరీక్షలో ఉత్తీర్ణులైనవారి రికార్డుల తనిఖీకి 2016 డిసెంబరులో ప్రధాన సమాచార కమిషనర్ అనుమతించారు. దీన్ని డీయూ సవాలు చేయగా.. 2017 జనవరిలో దిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది. తెలుసుకునే హక్కు కన్నా వ్యక్తిగత గోప్యతా పరిరక్షణ హక్కు మిన్న కాబట్టి.. సీఐసీ ఉత్తర్వును కొట్టివేయాలని దిల్లీ విశ్వవిద్యాలయం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ప్రధాని మోదీ డిగ్రీ వివరాలను కోర్టుకు అందించడానికి యూనివర్సిటీ సిద్ధంగానే ఉన్నా.. ఆర్టీఐ కింద ఈ వివరాలను అపరిచితులతో పంచుకునేందుకు సుముఖంగా లేదని తెలిపారు.

# దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు

## యూ ట్యూబర్‌పై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** మానసిక, శారీరక దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ సమే రైనాతో పాటు యూట్యూబర్లకు సుప్రీంకోర్టు హెచ్చరిక చేసింది. దివ్యాంగుల మనోభావాలను కించపరిచిన ఘటనలో క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. వాణిజ్యపరమైన భావస్వేచ్ఛా ప్రకటనలతో ఓ కమ్యూనిటీ మనోభావాలను దెబ్బతీయడం సరికాదు అని చెప్పింది. మీడియా ఛానళ్లలో దివ్యాంగులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని సమే రైనాతో పాటు ఇతర యూట్యూబర్లకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించే రీతిలో కార్యక్రమాలు నిర్వహించాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. సమే రైనాతో పాటు విపున్ గోయల్, బల్‌రాజ్ పరంజీత్ సింగ్ ఘాయ్, సొనాలీ ఠక్కర్, నిశాంత్ జగదీశ్ తన్వర్‌కు కూడా కోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఇండియాస్ గాట్ లాటెంట్ యూట్యూబ్ షోలో.. స్పైనల్ మస్క్యూలార్ అట్రోఫీ దివ్యాంగుల గురించి అనుచిత రీతిలో రైనా జోక్ చేశాడు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ క్యూర్ ఎస్ఎంఏ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కోర్టులో పిటీషన్ వేసింది. ఇవాళ దివ్యాంగుల గురించి, రేపు మరొకరి గురించి మాట్లాడుతారని, దీని వల్ల సమాజం ఎక్కడికి వెళ్తుందని, ఇది ఎలా ముగుస్తుందని జస్టిస్ కాంత్ ప్రశ్నించారు.

# బిఆర్ఎస్ అదృశ్యం ఖాయం

## రాజకీయ ముఖచిత్రంలో ఇక మాయం

## పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ వ్యాఖ్యలు

**కరీంనగర్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** రాజకీయ ముఖచిత్రంలో బీఆర్ఎస్ అనే పార్టీ ఉండదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కరీంనగర్ కార్యకర్తల మీటింగ్ లో మాట్లాడిన ఆయన.. పది మంది ఎమ్మెల్యే సంగతి తర్వాత ముందు మీ కుటుంబ ఆస్తుల పంచాయితీ తేల్చుకోవాలని కేటీఆర్ పై సెటైర్ వేశారు. లక్షా 20 వేల కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ వాళ్లను దోషులుగా తేలిస్తే సుప్రీం కోర్టును ఆశ్రయించారు కానీ ప్రజా క్షేత్రంలో బీఆర్ఎస్ కు శిక్ష తప్పదని హెచ్చరించారు. గత పదేళ్లలో తెలంగాణలో శాంపిల్ సర్కార్ నడిపించారని ఫైర్ అయ్యారు. సమావేశంలో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. జనహిత పాదయాత్ర వల్ల బీజేపీ, భారాస కు కడుపు నొప్పి వస్తుంది. కార్యకర్త త్యాగ ఫలితంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రజల్లో జరుగుతున్న వాస్తవాలను తెలుసుకునేందుకే జనహిత పాదయాత్ర చేపట్టాం. ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న కార్యకర్తలను వదిలిపెట్టుకోబోమన్నారు. పేదవారి జీవిత కాల స్వప్నమైన ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నాం. పథకాలు రాని 10 శాతం వారే ఇబ్బంది పెడుతున్నారు .దీనిపై కార్యకర్తలు దృష్టి పెట్టాలి. బండి సంజయ్ వ్యాఖ్యల వల్లే బీసీ బిల్లు పెండింగ్ లో ఉంది. దేవుడి పేరు చెప్పకుండా బండి సంజయ్ మళ్ళీ గెలుస్తారా అని ప్రశ్నించారు. .అంబానీ, అదానీలకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతుంది. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గలేదు. 12 ఏళ్లలో రాష్టాన్రికి బీజేపీ ఏం చేసింది.? రాష్ట్రంలో జరిగిందంతా కాంగ్రెస్ హయంలోనే జరిగింది. 42 బీసీ రిజర్వేషన్స్ లో ముస్లింలకు 5.8 శాతం మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటికే 4 శాతం ఉంది. అయినా బీజేపీ 10 శాతం అని తప్పుడు ప్రచారం చేస్తోంది. బీజేపీ ఎంపీల వల్ల బీసీ ప్రజలకు అన్యాయం జరుగుతుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు .కరీంనగర్ బిజెపి ఎంపిలు దొంగ ఓట్లతో గెలిచారని



టిపిసిసి ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దొంగ ఓట్లతో గెలిచినట్టు తమ దగ్గర ఆధారాలున్నాయని అన్నారు. మహేష్ మీడియాతో మాట్లాడుతూ..బిజెపి కేంద్రమంత్రి బండి సంజయ్ కి మెజారిటీ ఎలా వస్తుంది? అని ఒకే డబుల్ బెడ్ రూమ్ ఇంట్లో 69 ఓట్లు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. బండి సంజయ్ అసలు బిసినే కాదని ఆయన దేశ్ ముఖ్ అని తెలియజేశారు. తెలంగాణలో ఓట్ల చోరిపై ఇసిని కలుస్తామని అన్నారు. ఎన్నికల సంఘం ఇలా ఉండటం మన దౌర్భాగ్యం అని ఆవేదనను వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపి అర్వింద్ గెలుపుపై కూడా అనుమానం ఉందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కొత్తగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వాళ్లు 10 నెలలు ఖచ్చితంగా పార్టీ కోసం పనిచేయాలని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చే వారికి అవకాశాలు ఉంటాయి కానీ పాత వారికి ముందు అవకాశం వస్తుందన్నారు. కరీంనగర్ లో కార్యకర్తల మీటింగ్లో మాట్లాడిన మీనాక్షి నటరాజన్.. ఓట్ చోరీ నీ ఆపాలంటే ఓటర్ లిస్ట్ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం బీజేపీకి ఫ్రంటల్ ఆర్గనైజేషన్ గా పని చేస్తోందని ఆరోపించారు మీనాక్షి నటరాజన్. కార్యకర్తల మనోభావాలు తెలుసుకునేందుకే అందరితో మాట్లాడామని చెప్పారు.

# ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు

## అమెరికా సుంకాలపై మోడీ పరోక్ష వ్యాఖ్య

## గుజరాత్ పర్యటనలో పలు అభివృద్ది పనులకు శ్రీకారం

**అహ్మదాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరోసారి పరోక్షంగా స్పందించారు. 'ఎంత ఒత్తిడి వచ్చినా.. రైతులకు హాని జరగనివ్వం' అని చెప్పారు. సోమవారం అహ్మదాబాద్ లో రూ.5,400 కోట్ల విలువైన పలు ప్రాజెక్టుల పనులను ప్రధాని మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. అమెరికా సుంకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంత ఒత్తిడి వచ్చినా.. తమ ప్రభుత్వం తట్టు-కునే బలాన్ని పెంచుకుంటూనే ఉంటు-ందని అన్నారు. చిన్న పారిశ్రామికవేత్తలు, రైతులు, పశుపోషకులకు ఎటు-వంటి హాని జరగనివ్వదని అన్నారు. నేడు ప్రపంచంలో, ప్రతి ఒక్కరూ ఆర్థిక ప్రయోజనాల ఆధారంగా రాజకీయాలు చేయడంలో బిజీగా ఉన్నారు. ఈ అహ్మదాబాద్ గడ్డ మీద నుంచి చెబుతున్నా.. చిన్న



పారిశ్రామికవేత్తలు, రైతులు, పశు పోషకులు.. అందరికీ, నేను మీకు పదే పదే హామీ ఇస్తున్నా. మీ ప్రయోజనాలు మోడీకి అత్యంత ముఖ్యమైనవి. ఎంత ఒత్తిడి వచ్చినా, తట్టు-కునే శక్తిని మనం పెంచుకుంటూనే ఉంటాం అని చెప్పారు. కాగా, రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలంటూ డోనాల్డ్ ట్రంప్.. భారత్ పై భారీ సుంకాలు విధించాడు. రెండు సార్లు 25 శాతం చొప్పున మొత్తం 50 శాతం అదనపు సుంకాలను విధించాడు. తాము చెప్పినట్లు వినకపోతే.. భారత్ మరిన్ని సుంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

8 | ఖమ్మం KHAMMAM | సంపుటి : 8 Volume : 8 | సంచిక : 48 Issue : 48 | జన విజయం JANA VIJAYAM | 31 ఆగష్టు - 06 సెప్టెంబరు, 2025 31 August - 06 September, 2025

## రాముడిని ఎగతాళి చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

### కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

**కరీంనగర్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** కాంగ్రెస్ పార్టీ శ్రీరాముడి పేరును ఎగతాళి చేస్తూ వస్తోందని, రాముడి పట్ల వారికి గౌరవం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శలు చేశారు. సోమవారం బండి సంజయ్ మాట్లాడుతూ – రామ సేతు కేసులో సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన పార్టీ కాంగ్రెస్‌నే. దశాబ్దాల పాటు రామ మందిర తలుపులు మూసి వేసింది కూడా కాంగ్రెస్‌నే అన్నారు. రాహుల్ గాంధీ ఒకప్పుడు 'రామ్ మందిర ఉద్యమం ఓడిపోయింది' అని వ్యాఖ్యానించలేదా? హిందువులను 'హింసాత్మకులు' అని అన్నది కాంగ్రెస్‌నే అని గుర్తుచేశారు. రామ్ మందిర ప్రాణ ప్రతిష్ఠకి కూడా హాజరుకావడానికి నిరాకరించింది అదే పార్టీ అని ఆరోపించారు. ఇక ఇప్పుడు రాముని పేరు ప్రస్తావిస్తున్న బీజేపీని కాంగ్రెస్ ఎగతాళి చేస్తోందని, ఇది వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బండి సంజయ్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు రాముని అవమానించడం అలవాటే. కానీ బీజేపీకి రాముడు అంటే ప్రాణం, విశ్వాసం. రాముడు రాజకీయాల కోసం కాదు... ఈ దేశపు గుండె చప్పుడు అని ఆయన స్పష్టం చేశారు. రామ మందిర నిర్మాణం, ప్రాణ ప్రతిష్ఠ వంటి సందర్భాల్లో కాంగ్రెస్ వైఖరి ప్రజలు మర్చిపోలేరని, రాముని పట్ల ఉన్న ఆప్యాయతను బీజేపీ ఎప్పటికీ రాజకీయం చేయదని బండి సంజయ్ పునరుద్ఘాటించారు.

## లారీ డ్రైవర్ నిర్లక్ష్యం

### బైక్‌పై నుంచి పడి తండ్రీ కూతురు మృతి

**చేవెళ్ల,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** సిమెంట్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ద్విచక్ర వాహనంపై వెళుతున్న తండ్రీకుమార్తె మృతి చెందారు. ఈ ఘటన చేవెళ్లలో సోమవారం సాయంత్రం చోటు–చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన తాండ్ర రవీందర్(32) కుమార్తె కృ(13) మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామ శివారులోని గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం కుమార్తెను పాఠశాల నుంచి ఇంటికి బైక్‌పై తీసుకెళ్తుండగా పట్టణ కేంద్రంలోని హైదరాబాద్–బీజాపూర్ రహదారిలో ఓ లారీ వచ్చి తాకింది. దీంతో బైక్‌పై ఉన్న రవీందర్, కుమార్తె కృప లారీ చక్రాల కింద పడిపోయారు. దీంతో రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా.. కొన ఊపిరితో ఉన్న కృపను చేవెళ్ల ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ర్యాపిడో డ్రైవర్లుగా మహిళలు

### అభినందనలు తెలిపిన మంత్రి లోకేశ్

**అమరావతి,ఆగస్ట్25(ఆర్ఎన్):** స్త్రీ శక్తి' ద్వారా ఉచిత బస్సు ప్రయాణ పథకం గొప్ప విజయమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మరోవైపు ర్యాపిడో భాగస్వామ్యంలో వెయ్యి మందికి పైగా మహిళా డ్రైవర్లకు ఉపాధి కలగడం సంతోషమని చెప్పారు. మహిళలు ఈవీ వాహనాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. రవాణా ప్రణాళిక (మొబిలిటీ) అంటే కేవలం ప్రయాణం కాదు.. ఇది అవకాశం, గౌరవం అని పేర్కొన్నారు. ముమ్మాటికీ ఇది మంచి ప్రభుత్వమే అని వివరించారు. మహిళల ర్యాపిడో వాహనాల డ్రైవింగ్‌పై ఓ వీడియోను లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## జూబ్లీహిల్స్‌లో మరో ఆక్రమణ తొలగింపు

### ప్రభుత్వ భూమికి కబ్జా చెర నుంచి విముక్తి

### 2వేల గజాల భూమి విలువ వందకోట్లు: హైడ్రా




**హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ):** హైడ్రా మరో ఆక్రమణను తొలగించింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు చేరువలోని ప్రధాన రహదారికి ఆనుకుని, ఆక్రమణలకు గురైన 2,000 చ.గ.ల భూమిని కాపాడినట్టు అధికారులు వెల్లడించారు. మార్కెట్‌లో ఈ భూమి విలువ సుమారు రూ.100 కోట్లుగా ఉంటుందని హైడ్రా పేర్కొన్నది.రెండు దశాబ్ధాలుగా అక్రమార్కుల చేతిలో కబ్జా అయిన భూమికి హైడ్రా సోమవారం విముక్తి కల్పించింది. జూబ్లీహిల్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి సంబంధించిన ఈ భూమి లేఅవుట్ ప్రకారం ప్రజావసరాలకు ఉద్దేశించిందని హైడ్రా తెలిపింది. పిల్లా సత్యనారాయణ ఆ భూమిని ఆక్రమించి, ఫేక్ ఇంటి నెంబర్ క్రియేట్‌చేసి అందులో నర్సరీ నడుతున్నాడనీ, ఆయనపై జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైనట్టు– అధికారులు వివరించారు. ఆ భూమిని జీహెచ్ఎంసి పలుమార్లు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసింది. ఆక్రమణకు పాల్పడిన సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టును కూడా తెచ్చుకున్నాడు. స్టేటస్‌కో ఉంటుండగా అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. నర్సరీ నడపరాదు. కానీ, అక్కడ అనుమతిలేని పెద్దుల నిర్మాణాలు, నర్సరీ వ్యాపారాన్ని నిర్వహించారు. జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఈ అవకతవకలపై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. లేఅౌట్ ప్రకారం ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలంగా నిర్ధారించారు. నర్సరీ నడుపుతున్న సత్యనారాయణకు హైడ్రా నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులపై తిరిగి హైకోర్టును ఆశ్రయించిన సత్యనారాయణకు అక్కడ చుక్కెదురైంది. గతంలో ఉన్న స్టేటస్‌కోను కూడా కొట్టేసి.. హైడ్రా తీసుకోబోయే చర్యలకు హైకోర్టు అనుమతినిచ్చిందని హైడ్రా అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాలతో సోమవారం ఉదయం జూబ్లీహిల్స్‌లో కూల్చివేతలను హైడ్రా చేపట్టింది. నర్సరీలో మొక్కలను తరలించుకునేందుకు అవకాశం ఇచ్చి అక్కడ పెద్దలతో పాటు ఆక్రమణలను తొలగించింది. 2.000 చ.గ.ల స్థలంలో హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులను హైడ్రా ఏర్పాటు చేసింది. జూబ్లీహిల్స్ కోఆపరేటివ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు రవీంద్రనాథ్‌తో పాటు పాలక మండలి సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు. సుదీ–ర్ఘంగా తాము చేస్తున్న న్యాయ పోరాటం ఫలించిందని వారు పేర్కొన్నారు. రూ. 100 కోట్ల విలువచేసే భూమిని కబ్జాదారుల నుండి విడిపించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు జీహెచ్ఎంసి అధికారులకు సొసైటీ ప్రతినిధులు, పాలకమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కేసుల విచారణ..తీర్పుల్లోనూ గడువు విధించాలి

### న్యాయవ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి

మన న్యాయవ్యవస్థ ఇంకా బ్రిటిష్ కాలంనాటి పరిస్థితులకు అనుగుణంగానే సాగుతోంది. న్యాయ వ్యవస్థతో పాటు చట్టాలు, శిక్షల్లో భారతీయాకరణ జరగాల్సి ఉంది. కొత్త చట్టాలు ప్రవేశ పెట్టిన దరిమిలా దీనిపై చర్చ చేయాలి. రాజకీయ నాయకుల నేరాలకు సంబంధించి ఇటీవల పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ప్రవేశ పెట్టిన దరిమిలా అనేక అంశాలపై చర్చించాలి. అలాగే గవర్నర్లు, రాష్ట్రపతి బిల్లుల ఆమోదంలో కాల పరిమితి విధించిన సుప్రీం కోర్టు, తన విషయంలోనూ పరిమితి విధించుకోవాలి. ఏళ్ల తరబడి కేసులు నడవడం, తీర్పులు వచ్చే సరికి కొందరు మరణించడం జరుగుతోంది. ఒక్కో కేసు పరిమిత కాలంలో ముగించేలా సంస్కరణలు రావాలి. ఏ కేసయినా ఏడాదికి మించకుండా చూడాలి. సిబిఐ, ఇడి దాడుల కేసుల్లో కూడా సత్వర విచారణ జరగడం లేదు. ఎపికి సంబంధించి వివేకా హత్య కేసు ఆరేడేళ్లుగా ఎటూ తేలలేదు. సిబిఐ విచారణ జరిపినా దోషులు ఎవ్వరన్నది తేల్చలేదు. ఇకపోతే జగన్ ఐదేళ్లు బెయిల్ మీద ఉంటూ పాలన చేశారు. అనేక కేసులు ఇంకా కొలిక్కి రాలేదు. కెసిఆర్ అవినీతిపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఎలూ తేల్చలేదు. సత్వరంగా కేసులను విచారించి దోషులకు కేసు పడేలా చేయాలి. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేసులో పరస్పర విరుద్ధ తీర్పులు ఇవ్వడమే గాకుండా 17 ఏళ్లుగా కోర్టులో నానింది. రాజకీయ నాయకుల కేసుల విషయంలో మరీ త్వరగా తీర్పులు రావాలి.ఎందుకంటే పెరుగుతున్న నేరాలు, కొత్తకొత్త మోసాలు, ఐటి మోసాలు, అత్యాచారాలు వంటి వాటిని పరిశీలించి చట్టాల ను మార్పు చేసుకోవాల్సి ఉంది. హత్యాచారం ఘటనలు మళ్లీ మ్లీ జరుగుతూనే ఉన్నాయి. అత్యాచారాలపై ప్రజల్లో భయం లేకుండా పోతున్నది. లిక్కర్ కేసులో సత్వర విచారణ సాగడం లేదు. నేతల అవినీతిపైనా విచారణ సాగడం లేదు. ఇప్పటివరకు పనిచేసిన న్యాయమూర్తులు ఆయా సందర్భాల్లో తమ విలువైన సూచనలు చేశారు. వాటిని సలహాలుగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి. ప్రజలకు ఏంచేస్తే సత్వర న్యాయం అందుతుందో ఆలోచించాలి. అవసరమైతే మాజీ ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల సలహాలు తీసుకోవాలి. ప్రతిపేదవాడికి న్యాయం అందించడమే న్యాయమూర్తి ప్రధాన లక్ష్యం కావాలి. దేశంలో న్యాయం పట్ల జరుగుతున్న ఆలస్యాన్ని గుర్తించి సత్వర న్యాయం అందేందుకు అసవరమైన చర్యలను చేపట్టాలి. నిర్ణిత కాలంలోగా న్యాయ విచారణలు, తీర్పులు వచ్చేలా నట్టబద్దం చేసుకోవాలి. ఇదే సందర్భంలో పెండింగ్ కేసులు సమస్యగా మారాయని కూడా గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. ప్రతి తీర్పులోనూ ప్రజలకు న్యాయం జరిగిందన్న భావన కలగించాలి. రాజకీయ నాయకుల కేసుల విషయంలో త్వరగా విచారణ జరిపి శిక్షలు వేస్తే మంచిది. కోర్టు తీర్పులను అమలు చేయని ప్రభుత్వాలపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి. ఇటీవల పలువురు సుప్రీం చీఫ్ జస్టిస్‌లుగా పనిచేసిన వారు న్యాయవ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇవన్నీ కూడా పేదలకు సత్వర న్యాయం అందాలన్న తపనతో చేసినవే తప్ప మరోటి కాదు. భారత న్యాయ వ్యవస్థ సాధారణ ప్రజలకు ఎంతో దూరంలో నిలిచిందన్న ఆరోపణల్లో వాస్తవాలను గుర్తించాలి. ఇప్పటికీ కోట్ల మంది అణగారిన వర్గాల ప్రజలకు న్యాయ సహాయం అవసరం ఉంది. తమకు అన్యాయం జరిగిందని భావించిన ప్రతి వారూ కోర్టులకు వెళ్లడం లేదు. ఎందుకంటే కోర్టులకు వెళితే తేలేదేమీ లేకపోగా అనవసర కాలయాపన, డబ్బులు దండగ అన్న భావనలో ప్రజలు ఉన్నారు. అవసరమైన వెంటనే న్యాయ వ్యవస్థను ఆశ్రయించడానికి ఇంకా వారు జంకుతూనే ఉన్నారు. న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తి స్తున్నప్పటికీ నిర్ణీత కాలవ్య వధిలో కోర్టుల్లో కేసులు తేలడంలేదు. తీర్పులు వచ్చాక అమలు కావడం లేదు.అంబేద్కర్ మహాశయుడి ఆలోచనలకు అందని విధంగా మన రాజకీయాలు మారుతున్నాయి. సామాన్యులకు న్యాయం అందకుండా పోతోంది. నిరంతరం రాజకీయ కేసులు తప్ప సామాన్యుల పక్షాన న్యాయవ్యవస్థ బలంగా నిలబడడం లేదు. నేటికీ ఎందరో చేయని నేరాలకు జైళ్లలో మగ్గుతున్నారు. ఇలాంటి వారిని ఎలా బయటకు తీసకుని వస్తారన్నది కూడా ముఖ్యం. అలాగే ఎలాంటి కేసునైనా కనీసం 3నెలల్లో ముగించి తీర్పును ఇచ్చేలా కఠిన చట్టాలను అమలు చేయాలి. తెలంగాణలో పలువురు ఎమ్మెల్యేలపై అనర్హత కేసును మూడు నెలల్లో తేల్చాలని సుప్రీం ఆదేశించింది. నిజానికి ఎన్నికలయిన ఓ నెలరోజుల్లోగా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఏవైనా కేసులు ఉంటే తేల్చేయాలి. ఏళ్లతరబడి కేసునలు నాన్చేయడం వల్ల ఐదేళ్ల పుణ్యకాలం గడిచిపోతోంది. చిట్టచివరకు ఎన్నికల ముందు తీర్పులు వ్యతిరేకంగా వచ్చినా చేయగలిగేది ఏమీ లేదు. కనుక వీటిపైనా దృష్టి సారించాల్సి ఉంది. న్యాయవ్యవస్థలో సమూల మార్పులు జరగాలని గుర్తు చేసుకోవాలి. ప్రధానంగా స్థానిక భాషల్లో కోర్టు కార్యకలాలపాలు సాగాలి. కోర్టుల్లో న్యాయ చర్చలను స్థానిక భాషల్లో చర్చించేలా చట్టం చేసుకోవాలి. గతంలో ప్రధాని మోడీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పుడీ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అర్థంకాని భాషలో కాకుండా ప్రజలకు అర్థం అయ్యే భాషలో న్యాయచర్చలు సాగాలి. కోర్టుతీర్పులు స్థానిక భాషల్లో విడుదల చేయాలి. పాలకులు పేదలకు న్యాయన్ని చేరువ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి. అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామని చెబుతున్న ప్రధాని మోడీ ఈ న్యాయవ్యవస్థలో ఉన్న లోటుపాట్లను గుర్తించి తక్షణ చర్యలకు పూనుకోవాలి. పార్లమెంట్ వేదికగా దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. వివేకానందరెడ్డి హ్యతకేసు, కోడికత్తి కేసులు తీసుకుంటే ఎంతలా జాప్యం జరుగుతుందో చూడవచ్చు. పోలీసుల విచారణలో జాప్యం.. కోర్టుల్లో జాప్యం వంటివన్నీ పోవాలి. కేసు తీవ్రతను బట్టి సత్వర విచారణ, తీర్పులు రావాలి. ఇందుకు అవసరమైతే.. మనదేశం వేల ఏళ్లుగా అనుసరించిన రాజ్యాంగ వ్యవస్థలను, న్యాయవ్యవస్థలను, ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి. నిజానికి కోర్టులు, రాజ్యాంగం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేదు. ప్రజలను కోర్టులకు చేరువ చేయడం రాజ్యాంగ విధి కావాలి. రాజ్యాంగం అంటే పాలకులకు సంబంధించిన వ్యవహారంగా ఉండరాదు. న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు, విశ్వాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించాలి. లోకల్ కోర్టులను పెంచి సత్వర న్యాయం కలిగించాలి. మన న్యాయవ్యవస్థ, ప్రొసీడింగ్స్ ఇంకా ఆంగ్లేయులనాటి విధానాలనే అవలంబిస్తోందన్న ఆరోపణల నుంచి బయటపడి పటిష్టమైన న్యాయ చట్టాలను రూపొందిం చాలి. దీనిని ప్రాతిపదికగా తీసుకుని మన పాలకులు న్యాయవ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. సత్వర న్యాం అందడం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ఎలాంటి కేసయినా ఓ యేడాదిలోగా ముగిస్తే మంచిదన్న భావనలో విచారణలు సాగాలి.

## రైతుల ఇబ్బందులు బయటపడే విధానాలు రావాలి

ఇప్పటికే యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడ్డ రైతులపై దెబ్బమీద దెబ్బ అన్నట్లుగా అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీసాయి. పలు జిల్లాల్లో విపరీతమైన భారీ వర్షాలతో పంటలన్నీ నీటమునిగాయి. వేసిన పంటలన్నీ నీటి పాలయ్యాయి. పెట్టుబడులు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయాయి. అనేక జిల్లాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ఉత్తరాది రాష్ట్రాల్లోనూ ఇలాగే ఉంది. వరదలు వచ్చిన ప్రతిసారీ పంటనష్టం సకాలంలో అందడం లేదు. ప్రభుత్వం నష్టం అంచనా వేసి ఇచ్చే అరకొర పరిహారం కూడా ఎప్పుడు అందుతుందో తెలియదు. ఇకపోతే యూరియా సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. దీనిని బట్టి రైతులు ఎంతగా ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత మాత్రాన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టడం తగదు. బిజెపి నేతలు కూడా స్థానిక సమస్యపై చర్చించకుండా ఇక్కడి ప్రభుత్వంపైనే నిందలు వేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం పలుమార్లు విన్నవించినా పెద్దగా స్పందించలేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కేటాయించిన ఎరువులు కోటాను పరిశీలిస్తే తెలంగాణపై కొంత పక్షపాతం చూపిస్తున్నట్టుగానే కనిపిస్తోంది. ఈ సంవత్సరం పంటల సేద్యం పెరగవచ్చుననే దృష్టితో రాష్ట్రం 20 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కోరితే, రాష్ట్రానికేంద్రం కేటాయించింది 9.80 లక్షల టన్నులు మాత్రమే. ఆగస్టు ఆఖరినాటికి 8.30 లక్షల టన్నులు సరఫరా చేయాల్సిఉండగా ఈనెల ఆఖరికి వచ్చింది 5.66 లక్షల టన్నులు మాత్రమే. ఆ వివరాలు వ్యవసాయశాఖ మంత్రి పత్రికా ముఖంగా వివరించారు. ఇంకా సుమారు 3 లక్షల టన్నుల లోటు ఉండటం.. సకాలంలో కేంద్రం సరఫరా చేయకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఎప్పటికప్పుడు వస్తున్న ఎరువులను మానిటరింగ్ చేస్తూ యూరియాను డిమాండ్ ఉన్న ప్రాంతానికి పంపిస్తున్నామని, రైతులు ఎరువులు దొరకవని ఆందోళన చెందనవసరం లేదని ప్రభుత్వంప్రకటించింది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నాయకులు.. పాలకుల వైఫల్యమే అంటూ, ఎరువులు సరఫరా చేయలేని చేతకాని ప్రభుత్వాలంటూ విమ–ర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. విమర్శలు, మాటలు పక్కకుపెట్టి యుద్ధప్రాతిపదికన ఎరువులు సరఫరా జరిగేలా చూడమని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలు పరిశీలించకుండా రాష్ట్రంలో ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారు. రైతులు రాత్రింబవళ్లు సహకార బ్యాంకు గోదాముల వద్ద క్యూలైన్లో ఉంటూ.. పట్టా పాస్ బుక్కులు, చివరికి చెప్పులు కూడా క్యూలైన్లలో పెడుతూ, లైన్‌లో ఘర్షణలు పడుతూ, కొన్నిచోట్ల లాఠీచార్జీలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఎందుకు ఈ పరిస్థితి వచ్చింది? దీనికి బాధ్యులు ఎవరన్నది ఆలోచించాలి. రాష్ట్రాలకు యూరియా కేటాయింపులు, సరఫరా పూర్తిగా కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటాయి. రాష్ట్రం గత ఏడాది వేసిన పంటలను దృష్టిలో పెట్టుకుని 10 శాతం విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఖరీఫ్ సీజన్ రాకముందే ప్రణాళిక రూపొందించి, 20 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు కావాలని కేంద్రాన్ని కోరింది. గతంలో ఇచ్చిన 2 లక్షల టన్నులు ఇప్పటికే రాష్ట్రం వద్ద నిల్వలు ఉన్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఎప్పటికప్పుడు పంపుతున్నామని.. రూ. 80,000 కోట్లు సబ్సిడీ భరించామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. యూరియాపై ప్రభుత్వం భరిస్తున్న సబ్సిడీ ఎక్కువగా ఉంది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. చైనా నుంచే 20 శాతం దిగుమతి చేసుకోవాలి. సబ్సిడీని తగ్గించుకొనే ఎత్తులో భాగంగా తక్కువలో తెప్పించుకొనే ప్రయత్నం చేస్తుందని కేంద్రంపై విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా అన్నదాతలకు అగచాట్లు– తప్పట్లేదు.



ప్రస్తుతం వేసిన పంటలకు 15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వాన్ని కోరుతోంది. దాంతో డిమాండు ఎక్కువగా ఉండి.. సరఫరా తక్కువగా ఉండటంతో.. పంపిణీ కేంద్రాల దగ్గర వేకువ జాము నుంచే పడిగాపులు కాస్తున్నప్పటికీ సరుకు కొంతమందికే అందటంతో ఆందోళన మొదలయ్యింది. డిమాండును అడ్డుపెట్టుకొని పలుచోట్ల నల్ల బజారు విక్రయాలు యధేచ్ఛగా రూ.266 బస్తాను రూ. 400 వరకు అమ్ముతున్నారని విమర్శలు వస్తున్నాయి. పారిశ్రామిక అవసరాల కోసం వ్యవసాయ యూరియాను దారి మళ్ళిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

అతిగా రసాయన ఎరువుల వినియోగం, పంట మార్పిడి విధానం లేనందున నేలలో మంచి బ్యాక్టీరియా నశిస్తుంది. అతిగా నీరు పెట్టడం, ఎరువులు, రసాయనాలు వాడటం వల్ల భూసారం క్షీణిస్తుంది. రసాయన ఎరువులు, గుమ్మరిస్తే ఫల సాయం రెట్టింపు కాదు. దీనిపై రైతాంగంలో అవగాహన పెంచడంలో ప్రభుత్వాల వైఫల్యం.. మన ఆహార భద్రతనే ప్రమాదంలోనికి నడుతుంది. సాగు భూములను కాపాడుకోవాలంటే ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహిస్తూ, తగినంత పరిణామంలోనే ఎరువులు చల్లేలా అన్నదాతను చైతన్య పరచాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి హెచ్చరించింది. అయితే మోడీ నేతృత్వంలోని కేందప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క రైతు అనుకూల నిర్ణయం తీసుకోలేదు. అప్పుడప్పుడూ మద్దతు ధరలు పెంచడం తప్ప చేసిందేమీ లేదు. రైతుల సంఘాల నుంచి వ్యతిరేకతలు, ఆందోళనలు వస్తున్నా చర్చించడం లేదు. సాగుచట్టాలు తీసుకుని వచ్చాక అవి ఎందుకు మంచివో చెప్పలేక పోయింది. వాటిని రద్దుచేస్తున్న సమయంలోనూ ఎందుకు రద్దు చేస్తుందో చెప్పలేదు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా జాతీయ సాగు విధానం తీసుకుని రావవడంలోనూ.. దేశీయంగా పంటలను ప్రోత్సహించడంలోనూ విఫలమయ్యింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోడీ పండించిన పంటలను కొనుగోలు చేసే దిక్కు లేకుండా చేసింది. దేశీయంగా పంటలు పండుతున్నా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో రైతులు పోరుబాట పడుతున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడే విధానాలు రావాలి. అందుకు తగిన కృషి చేయాలి.

## పెద్దరికం సాధించాలి

**తిరుమల,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ):** సంతరించుకొన్న వయసును, పరిణతిని సాధించిన మనసును– కాగి చల్లారిన పాలతో పోల్చి చెబుతారు. నిప్పు సెగకు తట్టుకొని, పెళపెళ మరిగి నెమ్మదిగా చల్లారిన పాలపై మీగడ చిక్కగా పేరుకొంటుంది. అలాగే జీవితంలోని ఆటుపోట్లకు ఎదురీది, ఎన్నో అపజయాలను ఎదుర్కొని సాధించిన అమూల్యమైన అనుభవం వయసుపై దట్టంగా పేరుకొంటుంది. ఎదురుదెబ్బలు తిన్న వయసే పెద్దరికాన్ని సంతరించుకొంటుంది. దాన్ని 'గడితేరడం' అంటారు. అది అందరి విషయంలో జరగదు. కొందరినే పెద్దరికం వరిస్తుంది. తక్కినవారిని ముసలితనం ఆవరిస్తుంది. పెద్దరికం మ్లలెపొదలపై ఆరేసిన పట్టుబట్ట లాంటిది. దులిపితే చాలు, పరిమళం గుప్పుమంటుంది. వారిని కదిపితే చాలు, అనుభవం అబ్బురపరుస్తుంది. మరిగి మరిగి చల్లారిన పాల మాదిరే ఏళ్ల తరబడి మనసు కోపతాపాలతో కుతకుత ఉడికి, క్రమంగా అన్నిరకాల భావోద్వేగాలు చల్లారి, ప్రశాంతంగా చిక్కబడుతుంది. జీవనయానాన్ని ముగించేలోగా వృద్ధులందరూ ఆ తరహా పరిణతిని సాధించి తీరాలి. లేకుంటే ప్రయాణం చివరి భాగంలో చీకాకులు తప్పవు. మరగకాగిన పాలకు మజ్జిగచుక్క తోడయితే అది కమ్మని పెరుగవుతుంది. ఉప్పురాయి తగిలిస్తే విరిగిపోతాయి.

Edited,Printed,Published and Owned by **PALLA KONDALA RAO**, H.No:5-13/1,Allapadu Road,Bonakal(Village,Post & Mandal),Khammam District-507204, Telangana State.
Printed at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah nagar, Gurralapadu (V), Tallampadu (Post), Khammam(Rural) Mandal, Khammam District, Pin-507170, Telangana State.
Published at H.No:11-3-17/1, Beside Ankura Hospital,Balaji Nagar, Khammam-507002, Telangana State, **EDITOR : PALLA KONDALA RAO** **RNI. No. TELTEL/2017/74161**